# ఒలింపిక్ కలకు భారత్ రెడీ



- భారత క్రీడారంగంలో మరో చారిత్రాత్మక ఘట్టానికి సిద్ధమవుతోంది
- 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకుసన్నద్ధమవుతోంది
- ఈ మేరకు ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు
- వారణాసి 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్ షిప్‌లో ప్రసంగించారు
- 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోందని తెలిపారు
- ఒలింపిక్స్ ఆతిథ్యం దక్కితే ఆర్థిక వ్యవస్థ, పర్యాటక రంగం పుంజుకుంటాయి

02


# విశాల భారతి

1-5-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 5






# చంద్రబాబుని ఇరికించిన రేవంత్

కృష్ణా, గోదావరి జలాలపై తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోత్తల పథకానికి 90 టీఎంసీలు రావాల్సిందేనంటూ తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అలా కుదరకపోతే జూరాల నుంచి నేరుగా నీటిని తరలిస్తామని కూడా ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కూడా వార్నింగ్ ఇచ్చారు. ఇదే సమయంలో బనకచర్లను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ లిఫ్ట్ స్కీమ్ పై ముఖ్యమంత్రి రేవంత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## కృష్ణా, గోదావరి జలాలపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి

- పాలమూరికి 90 టీఎంసీలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం
- జూరాల నుంచి నీటిని తరలిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్
- చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆపమన్నారు
- రేవంత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి
- ఈ వ్యాఖ్యలే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సరికొత్త అస్త్రంలా మారాయి
- చంద్రబాబుని టార్గెట్ చేసే దిశగా పనిలో ఆ పార్టీ నేతలు పడ్డారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. నీళ్లు - నిజాలు' అన్న అంశంపై శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ క్రమంలోనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆపిన చరిత్ర తనదంటూ మాట్లాడారు. "నాకు నా ప్రాంతమే ముఖ్యం. ఆ తర్వాత పార్టీ. ఆ తర్వాత నాయకుడు. సీఎం కుర్చీలో ఉండి తెలంగాణకు అన్యాయం చేసేలా ప్రవర్తించను. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆపించిన చరిత్ర నాది. ఆ ప్రాజెక్టు పనులను ఆపితేనే చర్చలకు వస్తామని చెప్పిన చరిత్ర మాది" అంటూ వ్యాఖ్యానించారు.

మిగతా 3లో..



# నల్లమల సాగర్‌పై విచారణ

- ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య జల వివాదాలు ముదురుతున్నాయి
- తెలంగాణ పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీం కోర్టుకు వెళ్లింది
- దీనిపై నేడు సుప్రీంకోర్టులో కీలకమైన విచారణ జరగనుంది
- ఈ నేపథ్యంలో వాదనలను వినిపించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది
- సీఎం రేవంత్ రెడ్డి సీనియర్ న్యాయవాది అభిషేక్‌తో సమావేశమయ్యారు
- అన్ని ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని అధికారులను చెప్పారు



02



## పాలమూరు ప్రజలకు నిరాశే మిగిలింది

- పటాన్ చెరు ఐబీ గెస్ట్ హౌస్‌లో బీజేపీ ముఖ్య నేతల సమావేశం జరిగింది
- కార్యక్రమంలో మెదక్ లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు పాల్గొన్నారు
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు

03

## భక్తజన సంద్రంగా మేడారం



02

- ములుగు జిల్లాలోని మేడారం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది
- దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు
- జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించారు
- సంతానం కోసం జంపన్న, నాగులమ్మలకు ముడుపులు కట్టారు
- అలానే మంత్రి పొంగులేటి, సీతక్క మేడారం పనులను పరిశీలించారు
- ఈ నెల 20వ తేదీలోగా సీఎం రేవంత్ రెడ్డి సందర్శిస్తారని వెల్లడించారు

## బావపైనే కోపమంతా!

- కవిత తండ్రి కేసీఆర్, సోదరుడు కేటీఆర్‌ను విమర్శించలేకున్నారు
- బావ హరీష్ రావు మీద పడిపోతున్నట్టుగామాటలను బట్టి తెలుస్తోంది
- కేసీఆర్ అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవిని కూడా కట్టబెట్టారు
- దీంతో కవిత తాజాగా తన అసహనం మొత్తాన్ని బయటపెట్టారు
- కేసీఆర్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ హరీష్ రావుపై అనరాని మాటలు అనేశారు
- హరీష్‌ను పక్కన పెట్టకపోతే దేవుడు కూడా బీఆర్ఎస్‌ను కాపాడలేడన్నారు
- గుంట నక్క వ్యవహారం చూస్తే..తోక కుక్కని ఊపే పరిస్థితి వచ్చింది
- అసెంబ్లీని 5 రోజులు వాకౌట్ చేయడం ఎంతవరకు కరెక్ట్ అని నిలదీశారు

02



# రేవంత్‌ది కట్టుకథ



- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కట్టుకథలు చెప్పారని హరీష్‌రావు ఆరోపించారు
- తెలంగాణ భవన్‌లో కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు
- తెలంగాణ ప్రయోజనాలను ఫణంగా పెట్టిందే కాంగ్రెస్ అని విమర్శలు చేశారు
- నల్లగొండ జిల్లాకు మరణశాసనం రాశారని సంచలన ఆరోపణలు చేశారు
- గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌కు లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు
- కాంగ్రెస్ తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకుంటోందని అన్నారు
- రేవంత్, చంద్రబాబు లోపాయికారి ఒప్పందం కుదిరింది అని విమర్శించారు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుకథలు చెప్పారని ఆరోపించారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు. తెలంగాణ ప్రయోజనాలను ఫణంగా పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అంటూ ఘాటు విమర్శలు చేశారు. నల్లగొండ జిల్లాకు మరణశాసనం రాసింది కూడా కాంగ్రెస్ పార్టీనే అంటూ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో కృష్ణా జలాలపై బీఆర్ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తోంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ..'అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారు. పాలమూరు వలసలకు కారణమే కాంగ్రెస్ పార్టీ. నల్లగొండ జిల్లాకు మరణశాసనం రాసింది కూడా కాంగ్రెస్ పార్టీనే. విభజనలో

మిగతా 3లో..

# రాహుల్ గాంధీని ఉరితీయాలి

## రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు

- 2 లక్షల ఉద్యోగాలు అని చెప్పిన మోసం చేశారని అన్నారు
- రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారని మండిపడ్డారు
- రాహుల్ గాంధీని ఎన్నిసార్లు ఉరి తీయాలి అని ప్రశ్నించారు
- నదీ జలాల విషయంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ మోసం చేస్తోంది
- రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు
- రేవంత్ రెడ్డి అధికార మదంతో విర్రవీగుతున్నాడని ధ్వజమెత్తారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2 లక్షల ఉద్యోగాలు అని చెప్పిన మోసం చేసిన రేవంత్ రెడ్డిని, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన రాహుల్ గాంధీని ఎన్నిసార్లు ఉరి తీయాలి అని ప్రశ్నించారు. నదీ జలాల విషయంలో

మిగతా 3లో..



# ఒలింపిక్ కలకు భారత్ రెడీ

**విశాలభారతి, నేషనల్:**

2026 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు భారతదేశం పూర్తిగా సన్నద్ధమవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఈ విషయాన్ని ప్రకటించారు. గత పదకొండున్నర ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం దేశంలో క్రీడా రంగంలో సమూల మార్పులు చేసి, 20కి పైగా ప్రధాన అంతర్జాతీయ టోర్నమెంట్లను నిర్వహించిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. భారత్ 'పూర్తి సన్నద్ధతతో' 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధమవుతోందని ఆయన అన్నారు. వారణాసిలో ప్రారంభమైన 72వ సీనియర్ నేషనల్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. 'గత దశాబ్దంలో ఫిఫా అండర్17 ప్రపంచ కప్, హాకీ ప్రపంచ కప్ సహా 20కి పైగా ప్రధాన అంతర్జాతీయ టోర్నమెంట్లను దేశంలోని పలు నగరాల్లో నిర్వహించామని తెలిపారు. 2030 కామన్వెల్త్ క్రీడలు కూడా భారత్‌లోనే జరగనున్నాయి. భారత్ పూర్తి సన్నద్ధతతో 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని చూస్తోంది. ఎక్కువ మంది క్రీడాకారులకు ఆడేందుకు ఎక్కువ అవకాశాలు కల్పించడం తమ లక్ష్యమని' చెప్పారు.



దేశం ప్రస్తుతం 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' పై ప్రయాణిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. దేశంలోని ప్రతి రంగం, అభివృద్ధి నిర్వచనం ఈ 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' తో ముడిపడి ఉందని, క్రీడలు కూడా అందులో ఒకటని అన్నారు. 'క్రీడా రంగంలో కూడా కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంస్కరణలు చేపట్టింది. నేషనల్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్ యాక్ట్, ఖేలో ఇండియా పాలసీ 2025... వంటి నిబంధనల ద్వారా సరైన ప్రతిభకు అవకాశం లభిస్తుంది. తద్వారా క్రీడా రంగంలో పారదర్శకత పెరుగుతుంది. అలాగే దేశ యువత క్రీడలు, విద్య రెండింటిలోనూ ఒకేసారి ముందుకు సాగనున్నారు. ఒకవైపు మనం మెరుగైన మౌలిక సదుపాయాలు, నిధుల సమీకరణ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. దాంతో పాటు యువతకు అద్భుతమైన జీవితాన్ని క్రీడల ద్వారా అందించడానికి కూడా కృషి చేస్తున్నాం' అన్నారు.

ఒకప్పుడు క్రీడల పట్ల ప్రభుత్వం, సమాజంలో సైతం ఉదాసీనత ఉండేదని మోదీ అన్నారు. చాలా తక్కువ మంది యువకులు క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేవారు. గత దశాబ్దంలో క్రీడల పట్ల ప్రభుత్వం, సమాజం ఆలోచనలలో మార్పు కనిపిస్తోందని మోదీ అన్నారు. క్రీడా రంగంలో తన ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, 'మేం స్కూల్ స్థాయిలో కూడా క్రీడాకారులకు ఒలింపిక్ అనుభవాన్ని అందించడానికి కృషి చేస్తున్నాం. ఖేలో ఇండియా ప్రచారం వల్ల వందలాది మంది యువకులకు జాతీయ స్థాయిలో ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది. కొద్ది రోజుల కిందట ఎంపీ క్రీడా మహోత్సవం జరిగింది. ఇందులో కూడా దాదాపు కోటి మంది యువకులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎంపీ క్రీడా మహోత్సవం సందర్భంగా కాశీకి చెందిన దాదాపు 3 లక్షల మంది యువకులు మైదానంలో సత్తా చాటారు. వారణాసిలో వివిధ క్రీడలకు సంబంధించిన స్టేడియాలు నిర్మిస్తున్నాం. కొత్త క్రీడా సముదాయంలో చుట్టుపక్కల జిల్లాల క్రీడాకారులకు కూడా శిక్షణ పొందే అవకాశం లభిస్తోంది. మెగా టోర్నీలకు వారణాసి సిద్ధమవుతుండటంతో నాకు సంతోషంగా ఉంది. వాలీబాల్ జాతీయ పోటీల ద్వారా దేశ క్రీడల్లో నగరం స్థానం సంపాదించుకుంటుందని' ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఒలింపిక్స్ నిర్వహణపై భారత్ 2019 నుంచే ఆసక్తి చూపిస్తోంది. దీనికోసం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)తో నిరంతరం చర్చలు జరుపుతోంది. 2023లో ముంబైలో జరిగిన ఐఓసీ సమావేశం మన బిడ్ ప్రయత్నాలకు మరింత బలం చేకూర్చింది. గతంలో 1951, 1982 ఆసియా గేమ్స్, 2010 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహించిన అనుభవం భారత్‌కు ఇప్పుడు కలిసి రానుంది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్ వంటి ప్రపంచ స్థాయి స్టేడియాలు ఇప్పటికే సిద్ధంగా ఉండటం మనకు అదనపు బలం.

ఒలింపిక్స్ ఆతిథ్యం దక్కితే దేశ ఆర్థిక వ్యవస్థ, పర్యాటక రంగం భారీగా పుంజుకుంటాయి. అయితే ఈ పోటీలో భారత్‌తో పాటు టర్కీ, ఇండోనేషియా, జర్మనీ వంటి దేశాలు కూడా రేసులో ఉన్నాయి. ఐఓసీ ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ అన్ని దేశాల ప్రతిపాదనలను నిశితంగా పరిశీలిస్తోంది. భారీ మౌలిక సదుపాయాల నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ, కట్టుదిట్టమైన భద్రత వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి. వీటిని సమర్థవంతంగా నిర్వహించగలమని భారత్ విశ్వాసంతో ఉంది.

# నల్లమల సాగర్‌పై విచారణ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆంధ్రప్రదేశ్‌తెలంగాణ మధ్య పోలవరంనల్లమల సాగర్ ప్రాజెక్టు గురించి వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లింది. సుప్రీంకోర్టులో సోమవారం కీలకమైన విచారణ జరగనున్న నేపథ్యంలో చట్టపరమైన వాదనలను బలంగా వినిపించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ముంబైలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో ఉన్నత స్థాయి వ్యూహాత్మక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం-నల్లమల సాగర్ విస్తరణ పనులను సవాలు చేస్తూ తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ఈ సమావేశం ప్రధానంగా దృష్టిసారించింది. నీటిపారుదల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సాంకేతిక, చట్టబద్ధమైన, పరిపాలనా ఉల్లంఘనలపై న్యాయ బృందానికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అన్ని ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని అధికారులను చెప్పారు. పోలవరం ప్రాజెక్టు విస్తరణను తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ కోరింది. ఆంధ్రప్రదేశ్ తప్పనిసరి అనుమతులు లేకుండా పోలవరం ప్రాజెక్టు అసలు ఆమోదించిన పరిధిని దాటి ముందుకు సాగుతోందని వాదించింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు ఆరోపిస్తూ వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను రూపొందించడంపై రాష్ట్రం అభ్యంతరం వ్యక్తం చేసింది. ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికలపై అధికారిక అభ్యంతరాలను విస్మరించారని తెలంగాణ పేర్కొంది. గోదావరి బేసిన్‌లో తెలంగాణ నీటి హక్కులను కాపాడుకోవాల్సిన అవసరాన్ని పేర్కొంటూ.. సీడబ్ల్యూసీ, కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డు జోక్యం చేసుకోవాలని తెలంగాణ కోరింది. విస్తరణకు పర్యావరణ అనుమతులపై స్టే ఇవ్వాలని, కేంద్ర ఆర్థిక సహాయాన్ని నిరోధించేలా ఆదేశించాలని తెలంగాణ ప్రభుత్వం తన పిటిషన్‌లో సుప్రీంకోర్టును విజ్ఞప్తి చేసింది.

బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం పట్టించుకోవడం మానేసింది. కేంద్రం కూడా డీపీఆర్‌ను వెనక్కి పంపింది. దీంతో ఆ ప్రాజెక్టు ఆగిపోయినట్లయింది. బీఆర్ఎస్‌కు రాజకీయ ఆయుధం పోయినట్లయింది.అయితే ఇలాంటి ఆయుధాలు తాము చాలా సృష్టించుకోగమని బీఆర్ఎస్ మరోసారి నిరూపించింది. ఆ పార్టీ నేత హరీష్ రావు మీడియా సమావేశం పెట్టి నల్లమల సాగర్ అనే ప్రాజెక్టును ఏపీ చేపడుతోందని ఇది బనకచర్ల కంటే డేంజరని.. ప్రభుత్వం చూసీచూడనట్లు వదిలేస్తోందని ఆరోపించేశారు. నల్లమల సాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటాయని, ముఖ్యంగా కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును తాము జలయుద్ధానికి ముడిసరుకుగా వాడుకుంటున్న పాలమూరురంగారెడ్డి పథకానికే లింక్ పెట్టారు. ఈ పథకం ద్వారా మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు అందాల్సిన నీటి వాటాను ఏపీ ప్రభుత్వం లాగేసుకునే ప్రయత్నం చేస్తోందని హరీష్ రావు ఆరోపించారు. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం గట్టిగా స్పందించడం లేదని, రాష్ట్ర హక్కులను కాపాడటంలో విఫలమవుతోందని ఆయన విమర్శించారు.ఇదే అసలు లైన్.

శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ను వాడుకునేందుకు దోర్నాల - ఆత్మకూరు మధ్య ఉన్న లోతట్టు ప్రాంతాలను కలుపుతూ ప్రాజెక్ట్ నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. నల్లమల కొండల మధ్య ఉన్న సహజసిద్ధమైన లోయలను వాడుకుంటూ, భారీ కట్టడాల ద్వారా నీటిని నిల్వ చేసేలా దీనిని డిజైన్ చేస్తున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి వరద నీటిని ఈ నల్లమల సాగర్‌కు తరలించాలని ప్లాన్ చేస్తున్నారు. కృష్ణా నదికి వరదలు వచ్చినప్పుడు వృథాగా సముద్రంలోకి వెళ్లే నీటిని ఇక్కడ నిల్వ చేసుకోవాలని అనుకుంటున్నారు. ఇంకా ఇది డీపీఆర్ వరకూ రాలేదు. దిగువరాష్ట్రమైన ఏపీకి.. తెలంగాణ నిల్వ చేసుకోగలిగినన్ని నీళ్లు నిల్వ చేసుకున్న తర్వాతనే కిందకు వదులుతుంది. ఏపీ నుంచి నీళ్లు సముద్రంలోకి పోవాల్సిందే. ఆ నీటిని ఆపుకోవడానికి ఏపీ ప్రభుత్వం ప్లాన్ చేసుకుటూంటే తెలంగాణకు అన్యాయం బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

# మున్నూరు కాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

- **ఆవిష్కరించిన మణికొండ వెంకటేశ్వరరావు**
- **తెలంగాణ రాష్ట్రం మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు**

**మేడిపల్లి, విశాలభారతి:**

జిహెచ్ఎంసి బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల ఎంఎల్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్ యందు మున్నూరు కాపు సంఘం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ సంఘం అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఎం.ఎల్.ఆర్ కాలనీ చెంగిచెర్ల అధ్యక్షులు పిల్లి శ్రీకాంత్ పటేల్, ప్రధాన కార్యదర్శి మాచర్ల శ్యాంసుందర్ పటేల్, కోశాధికారి దుంపల హరినాథ్ పటేల్, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఎర్ర నాగేంద్రబాబు పటేల్ రిటైర్డ్ జాయింట్ కలెక్టర్, అనుమల శ్రీనివాస్ పటేల్ ఏసిపి ఈస్ట్ జోన్, పి.ఎల్.ఎన్ పటేల్ ప్రముఖ కార్డియాలజిస్ట్ శ్రీకర్ హాస్పిటల్, యలగొండ కృష్ణ పటేల్ (సిఐ) యాదగిరిగుట్ట, వోడ్నాల నరసయ్య పటేల్ శ్రీ హెల్త్ కేర్ హాస్పిటల్ అధినేత, ప్రత్యేక ఆహ్వానితులుగా వేల్పుల శ్రీనివాస్ పటేల్ మేడ్చల్ మల్కాజ్గిరి మున్నూరు కాపు సంఘం ప్రెసిడెంట్, గోనె శ్రీనివాస్ పటేల్ మేడ్చల్ బిజెపి ప్రధాన కార్యదర్శి తెలంగాణ మున్నూరు కాపు సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి, ఉదయ్ భాస్కర్ పటేల్ ఎస్సై మేడిపల్లి, ఆకుల శ్రీనివాస్ పటేల్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మున్నూరు కాపు సంఘం కోశాధికారి, నవ్వరాజు పటేల్ అధ్యక్షులు మున్నూరు కాపు బాగ్ లింగంపల్లి, తదితరులు పాల్గొని చెంగిచెర్ల మున్నూరు కాపు సంఘం వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో రాష్ట్రం మున్నూరు కాపు మహాసభ చెంగిచెర్ల మున్నూరు కాపు సంఘానికి అండ దండాల నిలబడుతుందని అందరూ ఒకటే ఐక్యమత్యంతో ఉండి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలియజేశారు. చెంగిచెర్ల అధ్యక్షులు పిల్లి శ్రీకాంత్ పటేల్ మాట్లాడుతూ, ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మన మున్నూరు కాపు సమాజ ఐక్యతకు మరో మైలురాయిగా నిలిచిందని మీ అందరి సహాయ సహకారలతో అండ దండలతో ఈ కార్యక్రమాన్ని విజయ పదంలో నిర్వహించుకున్నామని మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.ఆర్ ఆర్ కాలనీ చెంగిచెర్ల మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# భక్తజన సంద్రంగా మేడారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు దేవతలను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారాంతపు సెలవు కావడంతో వేలాది మంది కుటుంబ సమేతంగా తరలివచ్చారు. జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించారు. సంతానం కోసం జంపన్న, నాగులమ్మలకు ముడుపులు కట్టారు. గద్దెల ప్రాంగణంలో ఎత్తు బెల్లం, ఒడి బియ్యం, పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేసి రోజంతా ఆటపాటలతో సందడిగా గడిపారు. మరోవైపు మేడారంలోని ప్రధాన రహదారులన్నీ భక్తుల వాహనాలతో రద్దీగా మారాయి. దీంతో అధికారులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాలను పార్కింగ్ ప్రదేశాలకు తరలించారు. గద్దెల ప్రాంగణంలో తొక్కిసలాట జరగకుండా ఉండేందుకు భక్తులను క్రమ పద్ధతిలో దర్శనానికి అనుమతించారు. మంత్రి సీతక్క దేవతలను దర్శించుకుని పూజలు చేశారు. ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ గద్దెల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలానే ఆలయ అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయి. ప్రపంచంలోనే కోట్లాది మంది భక్తులు ఆరాధించే ఈ వనదేవతల ఆలయ పునరుద్ధరణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాబోయే జాతరకు ముందే, అంటే ఈ నెల 20లోగా పనులన్నీ పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్ మేడారంలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించారు. హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్న మంత్రులకు జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు పొంగులేటి, సీతక్క కలిసి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ల్యాండ్ స్కేపింగ్, ప్రధాన ఆర్చి నిర్మాణం, హరిత హోటల్ జంక్షన్ సుందరీకరణ పనులను పరిశీలించారు. జంపన్న వాగు వద్ద భక్తుల స్నానాల కోసం ఏర్పాటు చేస్తున్న స్నాన ఘట్టాలు, నీటి నిల్వ కోసం కడుతున్న ఆనకట్ట పనులను తనిఖీ చేశారు. ఇదే సందర్భంగా జంపన్న వాగు వద్ద ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బ్యాంబు చికెన్ క్యాంటీన్'ను మంత్రులు ప్రారంభించారు.



అనంతరం హరిత హోటల్‌లో అధికారులతో, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు జారీ చేశారు. జనవరి 12 నాటికి క్యూలైన్ల షేడ్స్, సివిల్ వర్క్స్ పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు. సంక్రాంతి పండుగ నుంచి జనవరి 31 వరకు మేడారం ప్రాంతం విద్యుత్ కాంతులతో వెలిగిపోవాలని సూచించారు. తాగునీటి ఎద్దడి లేకుండా బోర్ వెల్స్, చేతి పంపులు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణ కోసం జోన్ల వారీగా సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. పబ్లిక్ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలయ పునరుద్ధరణ పనులు 200 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండేలా రాతి కట్టడాలతో పూర్తి చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం సందర్శించి, ఒక రోజు అక్కడే బస చేసి, మరుసటి రోజు ఉదయం పునరుద్ధరించిన ఆలయాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈసారి జాతరకు కోట్లాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, అందుకు తగ్గట్టుగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. మంత్రి సీతక్క దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారని ప్రశంసించారు.

గతంలో చూసిన మేడారానికి ప్రస్తుతం చూడబోయే మేడారానికి చాలా తేడా ఉంటుందని, మేడారం మహా జాతర చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో జరపడానికి మంత్రులు పనులను పర్యవేక్షిస్తున్నారు. వందల ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నిలిచేలా గద్దెలను శాశ్వతంగా నిర్మాణం చేశారు. జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మేడారం జాతర ఘనంగా జరగనున్న నేపథ్యంలో జాతరకు వచ్చే భక్తుల కోసం సకల సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే మేడారం జాతరలో పాల్గొనే అన్ని శాఖలు పనులలో స్పీడ్ పెంచాయి. నేడు వచ్చే మేడారం జాతరను సమర్థవంతంగా నిర్వహించాలని మల్టీ జోన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించారు. మేడారంలో ఏర్పాటుచేసిన పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో ఐజి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా జాతరకు లక్షలాది ప్రజలు తరలివస్తారని, దానికనుగుణంగా పార్కింగ్ సౌకర్యాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

# బావపైనే కోపమంతా!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నేరుగా తండ్రి కేసీఆర్ ను, సోదరుడు కేటీఆర్ ను ఏమీ అనలేక.. కక్కలేక మింగలేక బావ హరీష్‌రావు మీద పడిపోతున్నట్టుగా ఆమె మాటలను బట్టి తెలుస్తోంది. తాను ఎంత మొత్తుకున్నా హరీష్ రావుపై దుమ్మెత్తిపోసినా కేసీఆర్ ఏమాత్రం లెక్క చేయకుండా అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవిని కట్టబెట్టడంతో కవిత తాజాగా తన అసహనం మొత్తాన్ని బయట పెట్టారు. కేసీఆర్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ హరీష్ రావుపై అనరాని మాటలు అనేశారు. తెలంగాణ రాజకీయాల్లో కవిత విమర్శలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. బీఆర్ఎస్ పరిణామాలపై కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీ వర్గాల్లో కాకరేపుతున్నాయి. "హరీష్‌కు ఎలాంటి బాధ్యతలు ఇవ్వొద్దు" అని కవిత ఎంతగా హెచ్చరించినా, పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం ఆ మాటలను పట్టించుకోకుండా బాధ్యతలు అప్పగించడంతో కవిత బరెస్ట్ అయ్యారు. ఇటీవల అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా హరీష్‌రావుకు బాధ్యతలు అప్పగించడాన్ని కవిత తీవ్రంగా తప్పుబట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణలో నీళ్ల రగడ ముదిరిన నేపథ్యంలో ఈ అంశంపై స్వయంగా కేసీఆరే అసెంబ్లీలో మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. హరీష్ ఏం చెప్పినా అది ప్రజల్లోకి వెళ్లదని, ఆయన ముందుకు రావడం వల్ల లాభం కంటే నష్టమే జరుగుతుందని ఆమె హెచ్చరించారు. నీటి అంశాలపై జరిగిన చర్చలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీరు, సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలకు అనుమతి లేకపోవడంపై పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించింది. ఈ మొత్తం ప్రక్రియను హరీష్‌రావు తన భుజాలపై వేసుకుని నడిపించారు. నీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన పనులు, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న ఆరోపణలను స్పష్టంగా వివరించే ప్రయత్నం చేశారు.



హరీష్‌ను పక్కన పెట్టకపోతే దేవుడు కూడా బీఆర్ఎస్‌ను కాపాడలేడు అన్న స్థాయిలో కవిత వ్యాఖ్యలు చేసినా కేసీఆర్‌తో పాటు కేటీఆర్ వాటిని పట్టించుకోలేదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. కవిత కంటే హరీషే పార్టీకి కీలకమన్న సంకేతం ఇది అని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇలాంటి పరిణామాల మధ్యే కవిత తాజాగా విలేకరుల సమావేశంలో బరెస్ట్ అయ్యారు. "గుంట నక్క వ్యవహారం చూస్తే..తోక కుక్కని ఊపే పరిస్థితి వచ్చింది..' అని నాకు అనిపిస్తోందని కవిత సంచలన సెటైర్ వేశారు. ఎవరు ఏమనుకున్నా.. ఎవరు ఏం అర్థం చేసుకున్నా తనకు తెలియదని.. ఒక్క మాట కాంగ్రెస్ వాళ్లు అంటే మొత్తానికి మొత్తం సభ వాయిదా వేసుకొని 5 రోజులు వాకౌట్ చేయడం ఎంతవరకు కరెక్ట్ అని కవిత నిలదీశారు. సభ పెట్టింది ఎవరికోసం అంటూ నిలదీశారు. దీంతో కవిత వ్యాఖ్యల్లో 'తోక ఎవరు? కుక్క ఎవరు?' అన్న పదాలు బీఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ నిర్ణయాలు ఎవరి చేతుల్లో ఉన్నాయన్న ప్రశ్నకు ఈ వ్యాఖ్యలు ప్రతిబింబమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హరీష్‌కు పగ్గాలు అప్పగించడం వల్ల పార్టీపై నియంత్రణ ఎవరిదన్న సందేహం కార్యకర్తల్లోనూ నెలకొంది.

హరీశ్ రావు తీసుకున్న నిర్ణయాల వల్లే సాగునీటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం వాటిల్లిందని కవిత ఆరోపించారు. కృష్ణా నదీ జలాల పంపకాల్లో మన హక్కులను తగ్గించి హరీశ్ రావు సంతకం ఎందుకు పెట్టారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. దీనిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాల్సింది పోయి, పారిపోవడం సరికాదన్నారు. తన స్వార్థం కోసం జూరాల నుంచి ప్రాజెక్టును శ్రీశైలానికి మార్చారని ఆమె విమర్శించారు. నిరసన తెలిపి బయటకు వచ్చినా, మిగతా బిల్లుల చర్చలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిందని ఆమె పేర్కొన్నారు. మొత్తానికి బీఆర్ఎస్‌లో కవిత మాటల యుద్ధం హాట్ టాపిక్ గా మారుతోంది. కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలతో మరింత ముదురుతోంది. ఇది అంతర్గత విభేదాలకే పరిమితమవుతుందా? లేక భవిష్యత్ రాజకీయ దిశను మార్చుతుందా? అన్నది కాలమే తేల్చాలి.

# జాతీయ స్థాయి వాలీబాల్ కోచ్‌గా మల్లేష్

**నియమించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ తెలంగాణ సెక్రటరీ ఉషారాణి**

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

ఎస్జిఎఫ్ అండర్ 14 జాతీయ స్థాయి తెలంగాణ రాష్ట్ర బాలికల వాలీబాల్ జట్టుకి రంగారెడ్డి జిల్లా యాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మానుపాటి మల్లేష్ ను కోచ్ గా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ తెలంగాణా సెక్రటరీ ఉషారాణి నియమించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా జమ్మలమడుగు లో ఈ నెల 5 నుండి ఇదే నెల 9 వరకు జరగనున్న జాతీయ ఎస్జిఎఫ్ అండర్ 14 బాలికల జట్టు కి కోచ్ గా వ్యవహరిస్తునందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి అభినందనలు తెలిపారు. యాచారం ప్రభుత్వ పాఠశాలకు చెందిన 8 వ తరగతి చదుతున్న క్రిషిక గత సంవత్సరం డిసెంబర్ నెలలో పెద్దపల్లి లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించి జాతీయ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు మల్లేష్ తెలిపారు.



## మహిళ ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం



- బోడుప్పల్లో 359వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు జ్ఞానమాల
- నత్తి మైసయ్య ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే 105వ జయంతి
- మహిళా లోకానికి ఆదర్శమూర్తి సావిత్రిబాయి పూలే

**మేడిపల్లి, విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 359వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపిటిసిలు కొత్త దుర్గమ్మ గౌడ్, నత్తి జంగమ్మ, ఊట్కూరు శారద, పొన్నం నీలిమ, జక్క పద్మ, సీనియర్ నాయకులు,జక్క రాములు, కిషన్ చారి, మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగ ప్రణయ్ తదితరులు పాల్గొని అంబేద్కర్ కు నివాళులర్పించారు. అనంతరం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తూ స్త్రీ విద్యా వికాసానికి, సమాజంలోని దురాచారాలను అంతం చేయడంలో తాను చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి, త్యాగం ఫలితంగానే భారతీయులందరికీ స్వేచ్ఛ, సమానత్వాలు లభించాయని ప్రతి ఒక్కరూ నిత్యం అంబేద్కర్ ఆశయాల కోసం ఆకాంక్షల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి మహిళ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మాజీ మహిళ ప్రజా ప్రతినిధులను ముఖ్య అతిథులుగా పిలిచి వారిని ఘనంగా నత్తి మైసయ్య సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు గరుగులయ్య యాకయ్య, బండారి సాయి, చిల్ల అంజయ్య, యేసు రాజు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రజలకు నిరాశే మిగిలింది

- పటాన్ చెరు ఐబీ గెస్ట్ హౌస్‌లో బీజేపీ ముఖ్య నేతల సమావేశం జరిగింది
- కార్యక్రమంలో మెదక్ లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు పాల్గొన్నారు
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు
- అప్పుడే పాలమూరు ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు
- శాసనసభలో ఒకరిపై ఒకరు తిట్టుకోవడానికే సరిపోతుందన్నారు
- రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమి లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



రెండేళ్ల తర్వాత తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మెదక్ లోక్‌సభ సభ్యుడు ఎం. రఘునందన్ రావు జోస్యం చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే పాలమూరు ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. అసెంబ్లీలో చర్చలను వ్యక్తిగత దూషణలకు తావు లేకుండా సబ్జెక్టు మీదనే జరపాలంటూ అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలకు ఆయన సూచించారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు ఐబీ గెస్ట్ హౌస్‌లో బీజేపీ నియోజకవర్గం ముఖ్య నేతల సమావేశంలో ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డితోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. శాసనసభలో పాలమూరు, కృష్ణా జలాలపై మాట్లాడకుండా ఒకరిపై ఒకరు తిట్టుకోవడానికే సరిపోతుందంటూ అధికార, విపక్ష పార్టీలపై మండిపడ్డారు. అసెంబ్లీలో బీఆర్ఎస్.. కాంగ్రెస్‌ను తిట్టడం, కాంగ్రెస్‌ను బీఆర్ఎస్ తిట్టడమే తప్పా.. చిత్తశుద్ధితో చర్చ జరగడం లేదన్నారు. వలసల జిల్లాగా ఉన్న పాలమూరుకు పదేళ్ల పాలనలో బీఆర్ఎస్, రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమి లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు బిడ్డగా సీఎం రేవంత్ రెడ్డి ఏదో చేస్తాడని నమ్మిన ప్రజలకు నిరాశే మిగిలిందని వ్యంగ్యంగా అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రెండు పార్టీలు.. నష్టం చేస్తూనే ఉన్నాయన్నారు. ఈ రెండు పార్టీలకు విజన్ లేదని చెప్పారు. ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని లక్ష్యంతో బీజేపీ నదుల అనుసంధానం పేరిట దేశవ్యాప్తంగా కార్యక్రమాన్ని చేపట్టిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మాత్రం నువ్వెంత తిన్నవు, నేనెంత తినాలే అనే ధ్యాసలోనే ఉన్నారన్నారు. శాసనసభలో ఓ మంత్రి పవర్ ప్రజంటేషన్ ఇస్తే ప్రతిపక్ష నేత మరో ప్రజంటేషన్ ఇస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రజలను మభ్య పెట్టడమే తప్ప కృష్ణా జలాల పంపిణీ, పాలమూరు విషయంలో నాటి బీఆర్ఎస్‌కు నేటి కాంగ్రెస్‌కు తేడా లేదని వివరించారు. ఈ రెండు పార్టీల సీఎంలు పాలమూరు ప్రజలను వంచించి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా 20 మంది ఎమ్మెల్యేలు లేకపోవడం విడ్డూరమని ఎంపీ రఘునందన్ పేర్కొన్నారు.

తాజాగా తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కృష్ణానది జలాలు, పాలమూరు ప్రాజెక్టుపై ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఓవైపు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తుండగా..బీజేపీ ఎమ్మెల్యేలు హాయిగా గాఢ నిద్రలోకి జారుకున్నారు. ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావుపాటిల్ కునుకు తీయడం చర్చనీయాంశంగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి కేటాయింపులపై బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని, శ్రీశైలం నుంచి ఏపీ ఏవిధంగా నీళ్లను అక్రమంగా తరలించిందో..ఆధారాలు, జీవోలతో సహా ఉత్తమ్ అసెంబ్లీలో వివరించారు. పదేళ్లలో కేసీఆర్ తెలంగాణకు చేసిన ద్రోహంపై సీరియస్ గా డిస్కషన్ జరుగుతుంటే బీజేపీ ఎమ్మెల్యేలు హాయిగా కునుకు తీసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పదేళ్లలో ఏపీ అక్రమంగా 1200టీఎంసీలు తరలించుకుపోయిందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. కృష్ణా జలాలపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా.. రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కు ఆనాడు జగన్ కు సహకరించింది కేసీఆరేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను ఆపించిన ఘనత కాంగ్రెస్ కే దక్కుతుదన్నారు ఉత్తమ్. కృష్ణా నీటి వాటాలో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకాలు చేసి తెలంగాణకు మరణ శాసనం రాశారని ఫైర్ అయ్యారు ఉత్తమ్. కృష్ణానదిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న పదేళ్లలో ఏపీ రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం రోజుకు 3టీఎంసీలు వాడుకుంటుంటే బీఆర్ ఎస్ ప్రభుత్వం సైలెంట్ గా ఉందని తెలిపారు ఉత్తమ్. కృష్ణా నీటి వాటాలో తెలంగాణకు కేటాయించిన వాటాను బీఆర్ఎస్ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని చెప్పారు. కృష్ణా జలాల వినియోగంలో రైతులు ఎక్కువగా వినియోగించుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనేనని తెలిపారు.

# చంద్రబాబుని ఇరికించిన రేవంత్

( మొదటి పేజీ తరువాయి )

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు ఆగాయా? లేదో.. కేసీఆర్, హరీశ్ నేతృత్వంలో నిజనిర్ధారణ కమిటీ వేసి చూసుకోవాలని చెప్పుకొచ్చారు.

తెలంగాణ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సరికొత్త అస్త్రంలా మారాయి. ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబుని టార్గెట్ చేసే దిశగా ప్రశ్నాస్త్రాలను సంధించే పనిలో ఆ పార్టీ నేతలు పడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కోట్ చేస్తూ... వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఓ ప్రకటన కూడా విడుదల చేసింది. “తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రబాబు చేతులు కలిపి రాష్ట్రానికి, రాయలసీమకు మరణ శాసనం రాశారు. తన స్వార్ధంకోసం, లాలూచీపడి రాయలసీమ ప్రాంతానికి వెన్నుపోటు పొడిచారు. తన చేతులతో కరువునేలకు మరణ శాసననం రాశారు. తెలంగాణ సీఎం రేవంత్‌తో రహస్య ఒప్పందం చేసుకుని రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్‌ను ఆపేశారు. ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డే ఆ రాష్ట్ర అసెంబ్లీలో స్వయంగా వెల్లడించారు. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి తన సొంత రాష్ట్రాన్ని ఈ రకంగా తాకట్టు పెట్టడం, రాష్ట్ర ప్రయోజాలను ఈ రకంగా తన స్వార్ధంకోసం అమ్ముకోవడం బహుశా దేశ చరిత్రలో ఎక్కడాచూసి ఉండం. చంద్రబాబు వల్లే ఆరోజు రాష్ట్రానికి ఆల్మట్టి రూపంలో ఒక శాపం వచ్చింది, కేంద్రం కట్టాల్సిన పోలవరం ప్రాజెక్ట్ కమీషన్లకోసం ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టి తన చేతిలోకి తీసుకున్నాడు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా ఇలా రాష్ట్రాన్నికోలుకోలేని విధంగా దెబ్బతీస్తూనే ఉన్నాడు” అని ప్రకటనలో పేర్కొంది.



“శ్రీశైలం నుంచి రాయలసీమకు, నెల్లూరుజిల్లాలకు నీళ్లు రావాలంటే ప్రాజెక్టు నీటిమట్టం 875 అడుగులు ఉంటేనేకాని పోతిరెడ్డిపాడు నుంచి సామర్థ్యం మేరకు పూర్తిస్థాయిలో నీళ్లు రావు. 840 అడుగులు ఉంటేనే హంద్రీనీవాకు నీళ్లు రావు. ఈ నేపథ్యంలో శ్రీశైలం నుంచి 800 అడుగులనుంచే నీళ్లు ఎత్తిపోసేందుకు తెలంగాణ రాష్ట్రం పలు ప్రాజెక్టులు చేపట్టింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రాజెక్టులనుంచి పెద్ద ఎత్తున నీటిని తీసుకెళ్లడానికి వేగంగా అడుగులు ముందుకేశారు” అని వివరించింది.

“శ్రీశైలం డ్యాం నిండకుండానే విద్యుత్ ఉత్పత్తితో తెలంగాణ రాష్ట్రం ఖాళీ చేస్తోంది. దీనివల్ల రాయలసీమ ప్రాంతానికి తాగునీటికి, సాగునీటికి తీవ్ర కొరతను దృష్టిలో ఉంచుకుని వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైయస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను, రాయలసీమ ప్రయోజనాలను కాపాడేందుకు వ్యూహాత్మకంగా, విప్లవాత్మకంగా నిర్ణయం తీసుకుని రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మొదలుపెట్టారు. శ్రీశైలంలో 800 అడుగుల నుంచే రోజుకు 3 టీఎంసీల నీటిని తీసుకునేందుకు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను జోరుగా ముందుకు తీసుకెళ్లారు. జగన్మోహన్‌రెడ్డిగారి పేరువస్తుందని గత ప్రభుత్వంలో చంద్రబాబుగారు తన టీడీపీ కార్యకర్తల ద్వారా కేసులు వేయించి అడ్డుకునే ప్రయత్నంచేశారు. అయినా సరే రాయలసీమ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టును ముందుకు కొనసాగించింది. ప్రభుత్వం మారిన తర్వాత ఈ ప్రాజెక్టు పూర్తిగా పడకేసింది” అని వివరించింది.

“చంద్రబాబు నాయుడు గారు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో పూర్తిగా చేతులు కలిపి, రహస్య ఒప్పందం చేసుకుని రాష్ట్రానికి, రాయలసీమకు తీరని అన్యాయం చేశారు. ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉండికూడా తన చేతుల ద్వారా స్వయంగా అడ్డుకున్నారు. తెలంగాణ శాసనసభలో ఇవాళ దీనికి సంబంధించి ఆరాష్ట్ర ముఖ్యమంత్రి వెల్లడించిన విషయాలు దీన్ని నిర్ధారిస్తున్నాయి. రాష్ట్రానికి, రాయలసీమ ప్రాంతానికి చంద్రబాబు చేసిన దుర్మార్గాన్ని ఖండిస్తున్నాం. ఇంతటి అన్యాయం చేసిన చంద్రబాబును ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరు” అని స్పష్టం చేసింది. మరోవైపు సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ సీఎం చంద్రబాబు ప్రభుత్వం స్పందించింది. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. రేవంత్ రెడ్డి మాటలు అసంబద్ధమని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఏపీ ప్రభుత్వం ఘాటుగా స్పందించింది. ఏపీ నీటి హక్కుల విషయంలో, ముఖ్యంగా రాయలసీమ సాగునీటి ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. గత వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సరైన అనుమతులు లేకుండానే రాయలసీమ ఎత్తిపోతల పనులు చేపట్టారని ఏపీ ప్రభుత్వం గుర్తు చేసింది. రోజుకు 3 టీఎంసీల నీటిని తరలిస్తామంటూ జగన్ హయాంలో చేసిన ప్రకటనల వల్లే తెలంగాణ ప్రభుత్వం కోర్టులకు వెళ్లిందని, ఫలితంగా 2020లోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, కేంద్ర ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పనులను నిలిపివేయాలని ఆదేశించాయని స్పష్టం చేసింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే కేంద్రం ఈ పనులను అడ్డుకుందని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా ఆయన ఒత్తిడి వల్ల పనులు ఆగలేదని ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

# రేవంత్‌ది కట్టుకథ

( మొదటి పేజీ తరువాయి )

సెక్షన్84 పెట్టి రాష్ట్రానికి అన్యాయం చేశారు. 11వ షెడ్యూల్‌లో మన ప్రాజెక్ట్‌లను ఎందుకు పెట్టలేదు?. కాంగ్రెస్ చేసిన ద్రోహాలను కప్పిపుచ్చుకున్నారు. పాలమూరురంగారెడ్డి, డిండి ప్రాజెక్ట్‌లను 11వ షెడ్యూల్‌లో పెట్టకపోగా విభజన చట్టంలో రక్షణ కల్పించామని సీఎం చెబుతున్నారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్ట్‌కు లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు.



కుట్రపూరితంగా ప్రాజెక్ట్‌లను నిర్లక్ష్యం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద సీఎం రేవంత్ కక్ష గట్టారు.. పాలమూరుపై పగబట్టారు. కాంగ్రెస్ తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకుంటోంది. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. రేవంత్ ప్రభుత్వం తెలంగాణకు ద్రోహం చేస్తోంది. కుట్రపూరితంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. 200414వరకు కాంగ్రెస్ పాలనలో 6.64లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారు. గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 48.74 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చింది. పాలమూరు ఎత్తిపోతలు, డిండి ప్రాజెక్ట్‌లను కొనసాగిస్తామని కేసీఆర్ స్పష్టంగా చెప్పారు.

టెలిమెట్రీ పెట్టాలని కేసీఆర్ ఎప్పుడో ఒప్పించారు. 2016లోనే టెలిమెట్రీ ఏర్పాటు చేశారు. సొంత ప్రాంతానికే రేవంత్ అన్యాయం చేస్తున్నారు. శాసన సభను రేవంత్ తప్పుదోవ పట్టించారు. తనకు అనుకూలంగా ఉన్న పేజీలను చదివారు. సభలో అసలైన పేజీలను రేవంత్ చదవకుండా వదిలేశారు. ఫస్ట్ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోనే ట్రిబ్యునల్ ఏర్పాటుపై ప్రశ్నించాం. రాష్ట్రం ఏర్పడిన 42 రోజుల్లోనే నీటి హక్కులపై కేంద్రాన్ని నిలదీశాం. కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్రమే ముఖ్యం. పోతిరెడ్డిపాడు అక్రమ ప్రాజెక్ట్ అని ఆనాడే కేసీఆర్ చెప్పారు. చంద్రబాబు ముఖం మీదే బల్లగుద్దినట్టు కేసీఆర్ మాట్లాడారు. ఉత్తమ్ కట్టుకథలు, రేవంత్ పిట్ట కథలు చెప్పారు. తెలంగాణకు నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్. రేవంత్ రెండేళ్లలోనే కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పచెబుదామంటారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు రేవంత్, చంద్రబాబు లోపాయికారి ఒప్పందం కుదిరింది అని విమర్శించారు. అసెంబ్లీలో అబద్ధాలు ఆడినందుకు రాజీనామా చేయాలి. కాంగ్రెస్ మాత్రం ఒక్క ప్రాజెక్ట్ డీపీఆర్ కూడా కేంద్రానికి పంపించలేదు. మీ పాలనలో మూడు డీపీఆర్‌లు వెనక్కి వచ్చాయి. అరెంజ్‌మెంట్, అగ్రిమెంట్‌కు తేడా తెలియకుండా విమర్శలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కేంద్రానికి 11 ప్రాజెక్ట్‌ల డీపీఆర్‌లను పంపించాం. ఏడు ప్రాజెక్ట్‌లకు అనుమతి తీసుకొచ్చాం. తెలంగాణకు కేసీఆర్ అన్యాయం చేశారంటే ఎవరైనా నమ్ముతారా?. రేవంత్ అబద్ధాలను చేసి నిజమే ఉరేసుకుంటుందేమో. బీఆర్ఎస్ హయంలోనే అత్యధికంగా కృష్ణా నీళ్ల వినియోగం జరిగింది. ప్రాజెక్ట్‌ల నిర్మాణాన్ని కేసీఆర్ పరుగులు పెట్టించారు. తెలంగాణకు బీఆర్ఎస్ మరణశాసనం రాసిందని చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. గత పదేళ్లు నీటి హక్కుల కోసం కేంద్రంపై కేసీఆర్ పోరాడారు. 2023లోనే 66:34 లేకుండానే అగ్రిమెంట్ చేశాం. కృష్ణా జలాల్లో 50:50 నీటి వాటాల కోసం కేంద్రానికి 28 లేఖలు రాశాం. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ వల్లే నీటి సమస్యలు వచ్చాయి అని చెప్పుకొచ్చారు.

అంతకముందు కేటీఆర్ మాట్లాడుతూ..‘నదీ జలాల మీద కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ద్రోహానికి పాల్పడుతోంది. అధికార మదంతో విర్రవీగుతూ, బలుపు మాటలతో రేవంత్ రెడ్డి విర్రవీగుతున్నాడు. ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని ఉరితీయాలి. రేవంత్‌కి ఒక్క భాషలో తిట్లు వస్తే మాకు నాలుగైదు భాషల్లో తిట్టడానికి వచ్చు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప తెలంగాణకు ఏం కావాలో.. రేవంత్‌కు తెలియదు. రేవంత్ మాటలతో కేసీఆర్ స్థాయి తగ్గదు. కేసీఆర్ గురించి ‘వినాశకాలే విపరీత బుద్ధి’ అన్నట్టుగా రెచ్చిపోయి మాట్లాడుతున్నాడు. కాంగ్రెస్ పార్టీని ఊరివేయాలి?. అసలు ఈ ముఖ్యమంత్రి గారికి బేసిన్లు తెలియదు.. బేసిన్ అంతకంటే తెలియదు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉంది అని అడిగే రేవంత్ రెడ్డి ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నాడు అంటూ సెటైర్లు వేశారు.

# రాహుల్ గాంధీని ఉరితీయాలి

( మొదటి పేజీ తరువాయి )

దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేసిన ద్రోహాన్ని ఎండగడుతూ, వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో లక్షల ఎకరాల భూములకు కొత్త సాగునీరు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందని, నీళ్లు ఇవ్వకుండా లక్షల ఎకరాలు ఎండిపోయేలా చేస్తున్న కాంగ్రెస్ నేతలకు జలాల అంశం, ప్రాజెక్టులపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సభానాయకుడి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అధికార మదంతో విర్రవీగుతూ, తెలంగాణ కోసం ప్రాణాలను పణంగా పెట్టిన కేసీఆర్ వంటి గొప్ప నాయకుడిని రాబందు అని విమర్శించడం ఆయన అల్పబుద్ధికి నిదర్శనమని విమర్శించారు. కరువు నేలల్లో జీవకళ తెచ్చిన కేసీఆర్ గురించి అనరాని మాటలు మాట్లాడితే తెలంగాణ ప్రజల హృదయాలు రగిలిపోతాయని హెచ్చరించారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులను ఉరితీయాలని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఘాటుగా సమాధానమిచ్చారు. మాట తప్పినందుకు ఉరి తీయాల్సి వస్తే, అశోక్ నగర్ అడ్డా మీద 2 లక్షల ఉద్యోగాల హామీని విస్మరించినందుకు రాహుల్ గాంధీని, రుణమాఫీ పేరుతో రైతులను వంచించినందుకు కాంగ్రెస్ నాయకత్వాన్ని, బీసీ రిజర్వేషన్లపై అబద్ధాలు చెప్పినందుకు రేవంత్ రెడ్డిని ప్రజలు ఎక్కడ ఉరి తీయాలో ఆలోచించుకోవాలి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో 'అట్టర్ ఫ్లాప్' అయ్యిందని





కేటీఆర్ ఎద్దేవా చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇరిగేషన్ పట్ల కనీస అవగాహన లేదని కేటీఆర్ విమర్శించారు. బేసిన్లకు, ఐఐటీలకు, ట్రిబ్యునళ్లకు మధ్య ఉన్న తేడాలు కూడా తెలియని వ్యక్తి జలాల గురించి చర్చించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమైక్యవాదుల సంచులు మోసిన చరిత్ర రేవంత్ రెడ్డిదని, అటువంటి అల్పుడి చేతిలో తెలంగాణ విలవిలలాడుతుండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణకు అత్యంత ద్రోహం జరిగిందని, దానికి కాంగ్రెస్ పార్టీయే పరిపూర్ణ బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు తన ఒత్తిడి వల్లే ఆగిపోయాయన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవి కేవలం రాజకీయ లబ్ధి కోసం చేసిన అసంబద్ధ వ్యాఖ్యలని, తెలంగాణ సీఎం మాటల్లో నిజం లేదంటూ కొట్టిపారేసింది. జగన్ ప్రభుత్వ హయాంలో అనుమతులు లేకుండా పనులు చేపట్టడం వల్లే 2020లో ఎన్‌జీటీ, కేంద్రం ఈ ప్రాజెక్టును నిలిపివేశాయని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. 2024లో కూటమి ప్రభుత్వం రాకముందే కేంద్రం ఆ పనులను నిలిపివేసిందని, ఇందులో రేవంత్ రెడ్డికి ఎలాంటి పాత్ర లేదని ఏపీ సర్కార్ వివరించింది. నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, వాస్తవాలను వక్రీకరించవద్దని ఏపీ ప్రభుత్వం హితవు పలికింది.

రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా బడివే అని అన్ పార్లమెంటరీ భాష మాట్లాడుతుంటే స్పీకర్ చూస్తూ కూర్చోవడం బాధాకరమని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశాడు. నీ అజ్ఞానాన్ని కప్పి పుచ్చుకోవడానికి నువ్వు ఇలా ప్రవర్తిస్తున్నావని అందరికి అర్థమైందని రేవంత్ కు చురకలు పెట్టారు. నదీ జలాల మీద కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా చేస్తున్న ద్రోహానికి, ద్రోహాలకు, కొనసాగుతున్న ద్రోహాల పరంపర విషయంలో వాస్తవాలు తెలంగాణ ప్రజల ముందు పెట్టడానికి బిఆర్ఎస్ పార్టీ తరపున మాజీ ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు హరీష్ రావు గారు పీపీటి ఇస్తున్నారన్నారు. శాసనసభ కొనసాగుతున్న పద్ధతి, శాసనసభలో ముఖ్యంగా సభానాయకుడి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్లు ఉందన్నారు. అధికార మదంతో విర్రవీగుతూ, బలుపు మాటలు మాట్లాడుతున్నారన్నారు. పదే పదే చావు నోట్లో తలపెట్టిన వ్యక్తి గురించి, ఒక రాబందు మాదిరిగా రైతుబంధు కేసీఆర్ గారి గురించి అనరాని మాటలు అంటున్నాడని సీఎం రేవంత్ ను ఏకిపారేశారు. కరువు నేలల్లో సిరులు పండించి, మరణ మృదంగాలు మోగిన చోట జీవకళ తెచ్చిన మానవీయ పరిపాలకుడు కేసీఆర్ అంటూ ఆయనపాలన గురించి మాట్లాడారు. ఇవాళ అట్లాంటి కేసీఆర్ గారి గురించి 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్నట్టుగా రెచ్చిపోయి మాట్లాడుతున్నాడని రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ గురించి మాట్లాడితే అందరి హృదయం రగిలిపోతుందన్నారు. కేసీఆర్ గారిని, హరీష్ రావు గారిని ఊరివేయాలని అని మాట్లాడుతున్నాడని, ఆ మాటకు వస్తే కాంగ్రెస్ పార్టీని ఎన్ని సార్లు ఊరివేయాలని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో నదీ జలాల అని చెప్పి చర్చ పెట్టారని, అసలు ఈ ముఖ్యమంత్రి గారికి బేసిన్లు తెలవదు, బేసిన్ అంతకంటే తెలవదన్నారు. దేవాదుల ఏ బేసిన్ లో ఉంది అని అడిగే వ్యక్తి ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నాడన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి సమైక్యవాదుల సంచులు మోస్తున్నప్పుడు, సమైక్యవాదుల బూట్లకు పాలిష్ చేస్తున్నప్పుడు తెలంగాణ కోసం కొట్లాడినామని కేటీఆర్ అన్నారు.

## హరీశ్ రావు వల్లే ప్రాజెక్టులకు నష్టం

- హరీశ్ రావు, జగదీశ్‌రెడ్డి అవినీతిపరులు
- కృష్ణా జలాలపై సభలో ప్రభుత్వం అబద్ధాలు
- సీఎం ఒక్కమాటంటే వాకౌట్ చేస్తారా?
- ఈ నిర్ణయం హరీశ్‌దా? లేక అధిష్ఠానానిదా?
- సూర్యాపేటలో మీడియాతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత
- సూర్యాపేట జిల్లాలో కొనసాగిన జాగృతి జనం బాట



**నల్లగొండ, విశాలభారతి:**

మాజీ మంత్రి హరీశ్‌రావు తీసుకున్న నిర్ణయాల కారణంగానే రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కృష్ణానదీ జలాల పంపకాల్లో రాష్ట్ర వాటా తగ్గించి ఆయన ఎందుకు సంతకం పెట్టారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం రెండోరోజు జాగృతి జనం బాట కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మీడియాతో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సీఎం అసెంబ్లీలో హరీశ్‌రావును ఓ మాట అన్నారని సమావేశాలను పూర్తిగా బహిష్కరించడం సరికాదన్నారు. సమావేశాల వాకౌట్ నిర్ణయం అధిష్ఠానానిదా? లేక హరీశ్ రావుదా? చెప్పాలని ఆమె నిలదీశారు. సభలో విపక్షం లేకపోవడంతో కృష్ణా జలాల విషయంలో ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్పిందని ఆరోపించారు. కృష్ణా జలాల వంటి కీలక అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు ప్రతిపక్షం అసెంబ్లీ నుంచి వెళ్లిపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్షం, చట్టసభలో మాట్లాడే అవకాశాన్ని వదులుకోవడం సరికాదని హితవు పలికారు. హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డిపై వ్యక్తిగతంగా తనకు కోపం లేదని పేర్కొన్నారు. ఓటుకు రూ. 10వేలు ఇచ్చి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తన తండ్రిని సర్పంచ్‌గా గెలిపించుకున్నారని ఆక్షేపించారు. మంత్రి ఉత్తమ్, జగదీశ్‌రెడ్డిది ఫెవికాల్ బంధమని వ్యాఖ్యానించారు. అందుకే సూర్యాపేటలో అక్రమాక్రలు జరిగినా ఉత్తమ్ స్పందించరని ఆరోపించారు. సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి అనుచరులు ఆలయాలు, చెరువులు, కుంటలు ఏదీ వదలలేదని ఆక్షేపించారు. అనంతరం కోదాడ పట్టణంలో ఆమె పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులు

- **మానవత్వమే రాజకీయానికి మూలం..సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్**
- **కుటుంబ సభ్యులకు బియ్యం మరియు ఆర్థిక సహాయం అందజేత**



**విశాలభారతి, కరకగూడెం:** మండలం తాటిగూడెం గ్రామ పంచాయతీలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పూనెం కృష్ణారావు దశ దిన కర్మల సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు మానవతా దృక్పథంతో తన వంతుగా 25 కేజీల బియ్యం అందించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అలాగే గ్రామ కమిటీ తరపున 2000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత్వమే రాజకీయానికి మూలం అని, కష్ట కాలంలో ఒకరికొకరు తోడుగా ఉండటం సమాజ బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత ,తాటిగుడెం ఉప సర్పంచ్ గాందర్ల రామనాథం,గ్రామ కమిటీ సభ్యులు పూనం శ్యాం కుమారి, గొగ్గలి కృష్ణ ,చందా శ్యామ్ , గోగు సాయి కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘంలో సీనియర్ సిటిజన్ సమావేశం



**సికింద్రాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నూతన సంవత్సర కార్యక్రమం న్యూ బోయగూడా ముదిరాజ్ భవన్లో సీనియర్ సిటిజన్ అధ్యక్షులు గోవింద రాములు ముదిరాజ్, దొడ్ల సదానంద ముదిరాజ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ ,తోట సురేందర్ ముదిరాజ్, సుదర్శన్ ముదిరాజ్, శ్రీనివాస్ రాజు ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్ ,రామోజీ నర్సింగరావు ,నీలం శ్రీనివాస్ భరద్వాజ్, సత్యనారాయణ మోహన్ ముదిరాజ్, ఈ కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

**టీయూడబ్ల్యూజే 143అధ్యక్షుడు చంద్ర శేఖర్**



**కొడంగల్, విశాల భారతి:** నియోజకవర్గ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై నిరంతర కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే 143 కొడంగల్ నియోజకవర్గ నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపాడు. నియోజకవర్గ పరిధిలోని,కోస్గి పట్టణ శివారు లో ,ఓ ప్రైవేట్ ఫాం హౌస్ లో కో కన్వీనర్ ప్రహ్లాద చారి ఆద్వర్యం లో ఏర్పాటు చేసిన టీయూడబ్ల్యూజే 143 యూనియన్ విస్తృత స్థాయి సమావేశం లో కొడంగల్ తాలూకా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం ఆయన మాట్లాడుతూ తన పై అపార నమ్మకం తో అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి సభ్యుడికి పేరు పేరు న కృతజ్ఞతలు తెలిపాడు. రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ సారథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి తిరుపతి రెడ్డి ఆశీస్సులతో సహచర జర్నలిస్టులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారు ప్రధానంగా ఎదురుకుంటున్న అక్రిడేషన్, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల సమస్యల సాధన కై నిరంతర కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశం లో యూనియన్ జిల్లా కో కన్వీనర్ ప్రహ్లాద చారి, గౌరవ అధ్యక్షుడు మల్లయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి సతాని నరసింహ, కోశాది కారి అశోక్ గౌడ్, ఉపాధ్యక్షులు అక్రం, అనంతయ్య, కార్యదర్శి అయూబ్, సహాయ కార్యదర్శి భీం శప్ప, నూతన అధ్యక్షుడు హన్మంతు, ప్రధాన కార్యదర్శి గోకుల్ సింగ్, కోశాధికారి పల్లె వీరేష్, ఉపాధ్యక్షుడు రాజప్ప, కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి దాసరి రమేష్, రమేష్ నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకల నుండి రక్తాన్ని సేకరిస్తున్న మటన్ షాప్ వ్యాపారి

**ఇద్దరు నిందితులను పట్టుకున్న పోలీసులు**



**కీసర,విశాల భారతి:** నాగారం సత్యనారాయణ కాలనీలో సోను చికెన్ అండ్ మటన్ షాప్ లో మేకల నుండి రక్తాన్ని సేకరిస్తున్నారు అని సమాచారం అందుకున్న కీసర పోలీసులు ఆదివారం తెల్లవారుజామున సోనూ మటన్ షాప్ పై దాడి నిర్వహించిన కీసర పోలీసులు.ఈ దాడిలో షాప్ యజమాని సుందర్ సోను,అతని ఉద్యోగి అఖిల్ అనే ఇద్దరు వ్యక్తులు గొర్రెలు మరియు మేకల నుండి రక్తాన్ని సేకరిస్తూ ఆ రక్తాన్ని 130 బ్యాగ్ లలో నిల్వ ఉంచినట్లు గుర్తించరూ.కీసర సి ఐ ఆర్కపల్లి ఆంజనేయులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మేకల నుండి సేకరించిన రక్తాన్ని కాచిగూడలో సీఎన్కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు తరలిస్తారు. అనంతరం అట్టి రక్తాన్ని ల్యాబొరేటరీలలో ఉపయోగించే షీప్ బ్లడ్ ఆగర్ ప్లేట్స్ తయారీకి వినియోగిస్తున్నట్లు విచారణలో తెలిసింది అని అన్నారు.ఈ కార్యకలాపాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించాము అని తెలిపారు.అసలు మేకల నుండి రక్తాన్ని తీయాలి అంటే వెటర్నరీ వైద్యుడు తీయాలి అని అన్నారు.తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం జీహెచ్ఎంసీ అధికారులకు మరియు వెటర్నరీ డిపార్ట్మెంట్ కి అప్పగించడం జరిగింది అని తెలిపారు.

## 2026 ఆంగ్ల క్యాలెండర్ ఆవిష్కరణ



**మేడిపల్లి, విశాలభారతి:** స్థానిక సాయి మందిరం ఆవరణలో వ్యవస్థాపక అధ్యక్షుడు సాయిని అమృతం ఆధ్వర్యంలో. రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ కుమార్, నాయకులు మల్లేశం రాష్ట్ర నాయకులు బాలరాజు, వనమాల శంకర్, నారపల్లి, బొల్లిగూడెం, చిలక నగర్.పిర్జాదిగూడ కుల బంధువులు కూడా పాల్గొన్నారు. అందరూ మాట్లాడుతూ కులబంధువులు ఐకమత్యముతో ఉండి అన్నిరంగాల్లో ముందుకు రావాలని, రాజకీయాల్లో కూడా మనసత్తా చాటి మన ఐకమత్యంచాటి చెప్పాలని నొక్కిచెప్పారు. సంఘం అధ్యక్షులు వీ వెంకట స్వామి, కార్యదర్శి బీ మధు మోహన్. సంక్షేమ సంఘం. యువజన సంఘాల అధ్యక్ష కార్యదర్శులు డీ విజయ కుమార్, వీ నర్సింగరావు, సాయిని నవీన్ సలహా దారులు డా లక్ష్మీ వీరమల్లు, డా. రామచంద్రం, నామని ఓంకార్, సత్యనారాయణ. బొల్లు శ్రీనివాస్. వై విష్ణు.ఎస్.ఆంజయ్య మొదలైన కుల బంధువులు అదిక సంఖ్య లో పాల్గొని ఆవిష్కరణ దిగ్విజయం చేశారు.

# భద్రాద్రిలో మద్యం బెల్ట్ నిషా

- **ఆగని మద్యం కుండ పోతా**
- **మద్యం సిండికేట్ తెరిసింది ఖాతా**
- **మద్యం సిండికేట్ కి పెట్టరా వాత**
- **చీకటి వ్యాపారంతో యువతకు చిక్కులు**
- **చిల్లర కొట్లలో ఆగని అల్లరి**
- **సిండికేట్ ఆగడాలకు అంతం ఎన్నడు**
- **అధికారులకు ఏమైనది ఈ దురంతాలను ఆపరా**



**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం పట్టణంలో మద్యం సిండికేట్ వ్యాపారం రోజురోజుకీ బరితెగించిపోతుంది. భద్రాచలంలో ఎన్నడూ లేని విధంగా యువత మద్యానికి అలవాటు పడి కొట్టుకొని మద్యం మత్తులు పొదుచుకొని చస్తుంటే చోద్యం చూస్తూ ప్రేక్షక పాత్ర పోషిస్తున్న అధికారులకు ఎవరు చెప్పాలి స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా నోరు మెతపక పోవడం సంబంధం లేనట్టు వ్యవహరించడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా మద్యం తాగి యువకులు కొట్టుకొని చస్తుంటే ఏం పట్టనట్టు వ్యవహరించడం దేనికి నిదర్శనమని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రతి గల్లీలో అనుమతులు లేకుండా చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం సిండికేట్ వ్యాపారస్తులు చిల్లర కొట్లల్లో చిల్లర వ్యాపారం మద్యాన్ని సరఫరా చేసి అమ్ముకుంటూ కోట్లకు పడగెత్తి సంపాదిస్తుంటే ఒక పక్క యువకులు తాగి రోడ్ల పైన భయంకరమైన పరిస్థితులను సృష్టిస్తుంటే అరికట్టలేక పోతున్న ప్రభుత్వ యంత్రాంగాన్ని ఏమనాలని సామాన్య ప్రజలు వారి ఆవేదనను వెళ్ళబోస్తున్నారు. ప్రధాన కారణం మద్యమే అని తెలిసినా కూడా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించట్లేదు ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రజలు వారి వాదనను వినిపిస్తున్నారు. భద్రాచలం అంటేనే ఇతర ప్రాంతాల వారికి భయం కలిగించే భయానక వాతావరణం మద్యం వలన కలుగుతుంటే ఇక్కడ ఏమి జరగట్లేదు అన్నట్లు ఎందుకు ఉపేక్షిస్తున్నారు. అర్థం కాని పరిస్థితి ఏర్పడుతుంది ఇప్పటికైనా సంబంధిత అధికారులు కచ్చితంగా మద్యం సిండికేట్ వ్యాపారస్తులు పైన చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజులు భయంకరంగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. సిండికేట్ చీకటి వ్యాపారం అరికట్టాలని హైవేల మధ్యన ఉన్న బార్ షాపులను తొలగించి భద్రాచలం పట్టణంలో ప్రశాంత వాతావరణమ్ కలిగే విధంగా ఉన్నత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అసలు భద్రాచలంలో మద్యం లేకుండా చేసి ఈ ప్రాంతంలో అల్లర్లు అలజడులు మర్డర్లు వంటి సంఘటనలు చోటుచేసుకున్న చేయాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## రబి వరిసాగుకు సరిపడా యూరియా నిల్వలున్నాయి



- **రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదు**
- **విలేకరుల సమావేశంలో ఏడిఏ బీ. తాతారావు**

**అశ్వాపురం, విశాలభారతి:** రబీ వరి సాగుకు సరిపడా యూరియ నిల్వలు ఉన్నాయని, వరి సాగు చేస్తున్న రైతులు యూరియా కోసం అధైర్య పడాల్సిన అవసరం లేదని ఏడిఏ తాతారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మండలంలో 3535 ఎకరాలలో వరిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1535 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేశారని ఇంకా రెండు వేల ఎకరాలలో వరిసాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రబి సాగుకు 2647 బస్తాల యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మండలం లో ఉన్న రెండు సొసైటీ కార్యాలయాలతో పాటు ప్రైవేటు ఎరువుల దుకాణాలలో కూడా యురియా దొరుకుతుందన్నారు. యూరియా అవసరమైన రైతులు పెస్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా బుక్ చేసుకోవాలన్నారు. ఇప్పటికే మెదక్, ఖమ్మం, వరంగల్, రాజన్న సిరిసిల్ల, నల్గొండ జిల్లాలలో యూరియా బుకింగ్ యాప్ లు వచ్చాయని, త్వరలో భద్రాద్రి జిల్లా కు కూడ అందజేస్తారన్నారు. ప్రతి ఎకరాకు రెండు బస్తాల చొప్పున యూరియా అందజేస్తారన్నారు. ఈ యూరియాను రైతులు ఎకరాకు 20 కేజీల చొప్పున నెలకు రెండు సార్లు చల్లుకుంటే పైరు ఆరోగ్యవంతంగా వస్తుందన్నారు. బుకింగ్ యాప్ అందుబాటులో లేని రైతులు సొసైటీ కేంద్రాలలోని సిబ్బందిని, స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే వారు బుక్ చేస్తారన్నారు. సొసైటీ కార్యాలయాల్లో కానీ, ప్రైవేటు ఎరువుల దుకాణాలలో యూరియాను ఎమ్మార్పీ ధర రూ. 266.50 లకే విక్రయిస్తారని ఆయన తెలిపారు. రవాణా చార్జీలు అదనమన్నారు. మార్చి నెల చివరి వరకు రైతులకు యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. ప్రైవేటు ఎరువుల దుకాణాలలో వ్యాపారులు ఎరువుల నిల్వ, ధరల పట్టికలను తప్పనిసరిగా చూపించాలన్నారు. లేని పక్షంలో ముందుగా వారికి షోకాస్ నోటీసులు అందజేసి సరైన సమాధానం రాకపోతే వారి షాపుల లైసెన్సులు సైతం రద్దు చేస్తామన్నారు. అనంతరం రైతులకు ఏ డి ఏ చేతుల మీదుగా యూరియా బస్తాలను అందజేశారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ ఏఓ ఎన్ చటర్జి, ఏ ఈ ఓ డి. రమాదేవి, సీఈఓ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు సున్నం రాంబాబు, కాకా రాములు, రైతులు కిలారు శేషగిరి, కొండ్రు నరసమ్మ, భద్రయ్య సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## దమ్మపేట గౌడయూత్ కమిటీ ఎన్నిక



- **అధ్యక్షుడిగా యార్లగడ్డ మణికంఠ ఏకగ్రీవ ఎన్నిక**
- **యూత్ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశ**
- **సభ్యత్వ రుసుము రూ.100గా నిర్ణయం**
- **సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు**

**అశ్వరావుపేట, విశాలభారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేటలో గౌడయూత్ కమిటీ ఎన్నికలు దమ్మపేట గౌడ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా పానుగంటి సందీప్‌ను, గౌరవ సలహాదారుడిగా పానుగంటి మణికంఠను ఎంపిక చేయగా, గౌడయూత్ కమిటీ అధ్యక్షుడిగా యార్లగడ్డ మణికంఠను, కోశాధికారిగా మట్టా మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సింహాద్రి సాయి, యార్లగడ్డ రాజా తదితరులను కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. ఎన్నిక అనంతరం అధ్యక్షుడు యార్లగడ్డ మణికంఠ మాట్లాడుతూ యూత్‌కు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. గౌడయూత్ కమిటీ సభ్యత్వ రుసుమును రూ.100గా నిర్ణయించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 11, 2026 ఉదయం దమ్మపేట గౌడ బజారులో ముగ్గుల పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పోటీలకు మొదటి బహుమతి రూ.5000, రెండో బహుమతి రూ.3000, మూడో బహుమతి రూ. 2000గా నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల ద్వారా ముందుకు సాగాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో పానుగంటి సందీప్, యార్లగడ్డ మణికంఠ, పానుగంటి మణికంఠ, గొల్లపల్లి వెంకటేష్, వీరంకి చరణ్, పానుగంటి గణేష్, పానుగంటి లోకేష్, మయూరి శ్రీకాంత్, మయూరి హర్ష, పానుగంటి శ్రీరామ్, యార్లగడ్డ హరిబాబు, చిలుకుబత్తుల విజయ్, వీరంకి బాబీ, పానుగంటి భార్గవ్, సిరిబత్తుల భూషణం, మిడత వేణు, జి. ప్రసన్న కుమార్, వీరంకి చెన్నరావు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలపై ప్రజలతో ప్రత్యక్ష చర్చ



**మేడిపల్లి, విశాలభారతి:** పీర్జాదిగూడ మినీ ట్యాంక్ బండ్‌గా పిలవబడే చెరువు పరిసర ప్రాంతంలో తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ఆదివారం నాడు మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా రవి కాలనీ వాసులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీల్లో దోమల తీవ్రత పెరగడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన వివరంగా చర్చించారు. దోమల నివారణకు తక్షణ చర్యలు అవసరమని పేర్కొన్న రవి , ఈ సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో కాలనీ వాసులు పరిశుభ్రత పాటిస్తూ, నీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే కాలనీలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు, దోమల నివారణ కోసం గుర్రపు డెక్క నివారణ, మినీ ట్యాంక్ బండ్ యొక్క ప్రహరీ గోడ గేట్ విరిగిపోవడం వంటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు తుంగతుర్తి రవి తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం తమ ప్రధాన లక్ష్యమని, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమం లో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకలో ఉచిత వైద్య శిబిరం



**సికింద్రాబాద్, విశాలభారతి:** తార్నాక డివిజన్‌లో ఫ్రీ మెడికల్ క్యాంప్ అపోలో ఆసుపత్రి సౌజన్యంతో, కాంగ్రెస్ నాయకుడు కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి సికింద్రాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ అదం సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజల ఆరోగ్య భద్రతకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. మాదక ద్రవ్యాలు సరికాదు.. అది మరణ శాసనం సికింద్రాబాద్ మణికేశ్వర్ నగర్‌లో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీని నియోజకవర్గ ఇంచార్జ్ అదం సంతోష్‌కుమార్ నిర్వహించారు. యువత మత్తుకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

## క్రీడా పోటీలలో పాల్గొనేందుకు పేర్ల నమోదు



**సికింద్రాబాద్, విశాలభారతి:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంసద్ ఖేల్ మహోత్సవం క్రీడా పోటీలలో పాల్గొన్నందుకు అర్హులైన వారి నుండి నమోదు చేయు కార్యక్రమము ఆదివారం బౌద్ధ నగర్ డివిజన్ లోని వారాసిగూడ చౌరస్తా ,పార్సిగుట్ట అశోక్ నగర్ ల లో క్రీడాకారుల నుండి స్వీకరించడం జరిగింది . స్వీకరించిన పత్రాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కార్యాలయంలో అందజేయడం జరుగుతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు .అనేక మంది యువకులు పై కార్యక్రమంలో పాల్గొన్నందుకు నమోదు కావడం జరిగిందని రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు. ఈ యొక్క క్రీడల్లో పాల్గొనేవారు స్థానిక ఆధార్ కార్డు,పార్లమెంట్ పరిధిలో సభ్యుడై ఉండవలెను. ఈ కార్యక్రమంలో బౌద్ధనగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ ,శ్యాంసుందర్ ,వెంకట చైతన్య , దత్తు,లడ్డు,జయంత్ , నవీన్ ,పాండు, అమరావతి, రాజు, కృష్ణ మాదిగ, కుమార్, నీలేష్, గజరాజు పాల్, భరత్, సంజయ్,మురలీదర్, నరేష్ ,కిరణ్ ,మహేష్, గోపి ,అనిల్ తదితరులు ఈ శిబిరంలో పాల్గొనడం జరిగింది.ఈ యొక్క శిబిరాన్ని రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి నాగేష్ రెడ్డి సందర్శించడం జరిగింది.

## సైడ్ డ్రైన్ ఆక్రమించిన వ్యాపారులు

**దుకాణదారుల తీరుపై పంచాయతీకి ఫిర్యాదు**



**అశ్వాపురం, విశాలభారతి:** మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు అంతా మాఇష్టం అనేలా వ్యవహరిస్తున్నారు. రోడ్డుకు రెండు పక్కల ఏర్పాటు చేసిన డ్రైనేజీ ని కూడా ఆక్రమించేస్తున్నారు. రోడ్డు వెడల్పు పనులలో భాగంగా కాంట్రాక్టర్ తో పాటు ఆర్ అండ్ బి అధికారులు డ్రైనేజ్ వరకు రోడ్డు లెవెల్ చేస్తున్నప్పటికీ వ్యాపారులు మాత్రం మట్టి పోసి ఇబ్బంది పెడుతున్నారని అధికారులు అంటున్నారు. ఎన్నిసార్లు చెప్పినా వ్యాపారులు అలాగే వ్యవహరిస్తున్నారని ఇక్కడ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న ఉద్యోగి ఒకరు చెబుతున్నారు. పట్టణాన్ని సుందరీ కారణగా చేయాలని తాము చూస్తుంటే ఇష్టమొచ్చినట్లు వారు చేస్తున్నారని అంటున్నారు. రోడ్డుపైన నీరు డ్రైనేజీలోకి వెళ్లే విధంగా తాము డ్రైను నిర్మాణం చేపట్టామని, వర్షాకాలంలో రోడ్డుపై ప్రవహించే నీరు కాలువలోకి వెళ్ళే విధంగా రంధ్రాలు పెడితే వారు మట్టి పోయడం వల్ల అవి పూడిపోతున్నాయని అంటున్నారు. డ్రైనేజీ ఆక్రమణ, మట్టి పోస్తున్న విషయంపై స్థానిక పంచాయతీ అధికారులతో పాటు మండల పరిషత్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని పనులు పర్యవేక్షిస్తున్న ఓ ఉద్యోగి చెబుతున్నాడు. షాపుల్లోకి వెళ్లేందుకు తాత్కాలిక ర్యాంపులు తయారు చేసుకొని నీళ్లు సైడ్ కాలువలోకి వెళ్లే విధంగా చూసుకోవాలని మండల కేంద్రంలోని వ్యాపారులకు అధికారులు చెబుతున్నారు.

## ఘనంగా డాక్టర్ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు




**విశాలభారతి, తొర్రూర్ ప్రతినిధి:** పాలకుర్తి మండల పరిధిలోని చెర్లాపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో డాక్టర్ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. పాలకుర్తి దేవస్థానం మాజీ డైరెక్టర్ తంగెళ్ళపల్లి సోమసత్తయ్య చారి ముఖ్య అతిథిగా హాజరై ఈ వేడుకలను స్వయంగా పర్యవేక్షించారు.గ్రామ నాయకులు మరియు కార్యకర్తల కోలాహలం మధ్య సోమసత్తయ్య చారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి డాక్టర్ రాజేందర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా.సోమసత్తయ్య చారి మాట్లాడుతూ.. డాక్టర్ రాజేందర్ రెడ్డి మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ప్రజల సేవలో నిరంతరం ముందుండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఎక్కటి నాగిరెడ్డి, బిరెల్లి మహబూబ్ రెడ్డి, ధర్మరపు సాయిలు, శేఖర్,విరెంకులు తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి సన్మానం



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని హైదరాబాదులో తన నివాసంలో కలిసి 18 డివిజన్ రోడ్ల నిర్మాణం గురించి నిధుల కోసం అడగడం జరిగినది. ముబారక్ నగర్ మాజీ సర్పంచ్ కేతం హనుమాన్లు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి అభివృద్ధి పనుల గురించి అధిక నిధుల గురించి అడగడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## బోర్గం (కె)లో అభివృద్ధి పనుల పరిశీలన

**నాణ్యత విషయంలో రాజీ పడొద్దు**



**నిజామాబాద్, విశాలభారతి:** నగరంలోని 2వ డివిజన్ పరిధిలోని బోర్గం (కె) గ్రామంలో ఆదివారం పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ నగర్ అధ్యక్షుడు బొబ్బిలి రామక్రిష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న నిర్మాణ పనులను దగ్గరుండి చూసిన అనంతరం, అక్కడి సూపర్వైజర్‌తో మాట్లాడి పనుల నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ముడి పదార్థాలను వాడాలని, పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణ పురోగతిపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం అంబేద్కర్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు వారి కమిటీ హాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలు విన్నపాలను అందజేశారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి రామకృష్ణ పార్టీకి మరియు గ్రామానికి అందిస్తున్న సేవలను గుర్తించి, వారిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోర్గం (కె) అధ్యక్షులు రాజు, నాయకులు మట్ట రాము, నగేష్, నవీన్ గౌడ్, కాంతయ్య, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణయ్యకు నివాళులు అర్పించిన టీజీఐడీసీ చైర్మన్



**సత్తుపల్లి, విశాలభారతి:** ఖమ్మం జిల్లా వేంసూర్ మండలం లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన మానికల కృష్ణయ్య ఇటీవల మృతి చెందగా, వారి చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ దుఃఖ సమయంలో మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని ఓదార్చారు. ఈ సందర్భంగా మువ్వా విజయబాబు మాట్లాడుతూ మానికల కృష్ణయ్య గ్రామంలో మంచి గుర్తింపు కలిగిన వ్యక్తిగా అందరి మన్ననలు పొందారని గుర్తుచేశారు. వారి ఆకస్మిక మరణం గ్రామానికి తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి వర్గీయులు, మువ్వా విజయబాబు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్లను పై నిర్ణయం తీసుకోవాలి

- **లేనిపక్షంలో రాష్ట్రంలో దేశంలో ఆందోళనలు చేపడతాం**
- **బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జి.అనంతయ్య**



**ముషీరాబాద్, విశాలభారతి:** బీసీ రిజర్వేషన్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిర్ణయం తీసుకోవాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జి. అనంతయ్య అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల తర్వాతనే రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం విద్యానగర్ లోని ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో అల్లం పల్లి రామ్ కోటి అధ్యక్షతన ఐక్యవేదిక ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జి. అనంతయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన నాటి నుండి పాలకుల చేతిలో బీసీలు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ఇంత నిరసన వెలువెత్తుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయని మండి పడ్డారు. బీసీ ఉద్యమం తీవ్ర రూపం దాల్చక ముందే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ల సమస్యను త్వరగాతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీ ఉద్యమ నేత ఆర్ కృష్ణయ్య నేతృతంలో గల్లి నుండి ఢిల్లీ దాకా పోరాటం చేసి రిజర్వేషన్లు సాధించుకుంటామన్నారు. లేని పక్షంలో అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో నిరసనలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో చంద్రవంక చిన్న రామస్వామి, కే సుధాకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్‌లో దట్టమైన చలి మంచు

- **ఉదయం సాయంత్రం ప్రయాణాలు తగ్గించుకోవాలి**
- **సిఐ పవన్ కుమార్ రెడ్డి**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం తీవ్ర చలి వాతావరణం నెలకొంది. ఉదయం 8 గంటలు దాటినా రహదారులపై దట్టమైన మంచు కమ్ముకుని ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చలి తీవ్రత కారణంగా దూరం నుంచి వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాల పెరిగే అవకాశం ఉంది. ప్రధాన రహదారుల వెంట చెట్లు, విద్యుత్ స్తంభాలు మంచు తెర వెనుక మసకబారి కనిపించాయి. ఉదయం వేళల్లో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు చలి నుంచి రక్షణకు స్వెటర్లు, జాకెట్లు ధరించి బయటకు వచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఆలస్యమయ్యారు. రానున్న రెండు మూడు రోజుల పాటు ఉదయం వేళల్లో ఇదే తరహా చలి కొనసాగే అవకాశం ఉండింది. వాహనదారులు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, ముఖ్యంగా ఉదయం వేళల్లో మంచు ఎక్కువగా ఉండటం వలన ఉదయం ప్రయాణాలు తగ్గించుకోవాలి. సి ఐ పవన్ కుమార్ రెడ్డి మరియు పోలీసులు సూచించారు.

## గరుడ రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో టీజీఐడీసీ చైర్మన్




**సత్తుపల్లి, విశాలభారతి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో కొండూరి రామ్ హరీష్, కొత్తూరు విజయ్ ఆహ్వానం మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన గరుడ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమానులను అభినందించి, వారి వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో యువకులు ముందుకు రావడం అభినందనీయమని మువ్వా విజయబాబు పేర్కొన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంలో ఇలాంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి వర్గీయులు, మువ్వా విజయబాబు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షులుని కలిసిన వినయ్ కుమార్ రెడ్డి



**నిజామాబాద్, విశాలభారతి:** తెలంగాణ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ని హైదరాబాదులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించిన ఆర్మూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి. వారితో పాటు పాల్గొన్న ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయి బాబా గౌడ్, మాజి మునిసిపల్ చైర్మన్ సాయి బాబా గౌడ్, ఇస్సాపల్లి సర్పంచ్ జీవన్ ,గగ్గుపల్లి సర్పంచ్ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖాందేశ్ శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ లు పులా నర్సయ్య,డార్లింగ్ రమేష్ నాయకులు పాల్గొన్నారు.

# జంగుబాయి జాతర సంబరాలలో ఆదివాసులు

**విశాలభారతి, ఆదిలాబాద్:** ఆదివాసీలకు ప్రకృతితో విడదీయరాని బంధం ఉంది, అడవే వారి జీవనాధారం,వారి భాష, వేషధారణ, పూజలు, పండుగలు అన్నీప్రకృతితో ముడిపడి ఉంటాయి, ముఖ్యంగా పుష్యమాసంలో జంగుబాయి అమ్మవారిని పూజిస్తారు, ఈజాతర నెలవంక కనిపించిన వేకువజామున మొదలైనెల రోజుల పాటు కొనసాగుతుంది, వివిధ రాష్ట్రాలనుంచి లక్షల మంది భక్తులు ఈ జాతరకు వస్తారు.వారి భాష, వేషధారణ, పూజలు, పండుగలు ప్రత్యేకంగా ఉంటాయి. ఈ జాతర, వారి జీవనశైలికి ఆదివాసీసంస్కృతికి అద్దం పడుతుంది, వారి నమ్మకాలు, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. తెలంగాణ, మహారాష్ట్రసరిహద్దులోని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిమండలం మహరాజ్ గూడ సమీపంలోని సహ్యాద్రి పర్వతాల్లోని గుహలో సహజసిద్ధంగా కొలువైన జంగుబాయిఅమ్మవారిని ఆదివాసీలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తుంటారు. వేల ఏండ్ల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రంలోప్రతి ఏటా జాతరను నిర్వహిస్తుంటారు. మన రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్గడ్ తదితర రాష్ట్రాల నుంచి ఆదివాసీలైన గొండులు,పర్ధాన్, కోలాం తెగలకు చెందిన ప్రజలు దర్శించుకుంటారు. పుణ్యక్షేత్రంలో 8 గోత్రాల కటోడాలు సంప్రదాయం ప్రకారం కఠిన నియమాలతో జాతర పూర్తయ్యేదాకా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు.







**దీపోత్సవంతో మొదలు**

ఎనిమిది గోత్రాల కటోడాల ఆధ్వర్యంలో ముందుగా దీపోత్సవంతో ప్రారంభిస్తారు. తుమ్రం, కొడప, సలాం,రాయిసిడాం, హెర్రె కుమ్ర, మరప, వెట్టి, మందడి.. ఇలా ఎనిమిది గోత్రాల కటోడాలు (పూజరులు) తొలిరోజుకాలినడకన పూజా సామగ్రి తీసుకెళ్లి అదే రోజు రాత్రిదీపారాధన చేసి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఇలా జాతర ముగిసే వరకు పూజలుకొనసాగిస్తుంటారు. జాతర జరిగే రోజుల్లో ఆదివాసీలుఉదయం తమ ఇండ్ల ముందు ఆవుపేడతో అలుకు చల్లుతారు. ఇంటి ఆవరణలోకి చెప్పులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. కాళ్లకి చెప్పులు కూడా వేసుకోరు.నేలపైనే పడుకుంటారు. మద్యం అసలే ముట్టుకోరు.కనీసం హోటల్లో నీటిని కూడా ముట్టుకోరు. ఇంటినుంచి కాలినడకన ఆలయానికి చేరుకుం టారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు మధ్యలో బస చేయాల్సివస్తే గంపను నేలపై ఉంచ కుండా మూడు బండలనుపేర్చి గోమూత్రంతో శుభ్రం చేసిన తర్వాత రాళ్లపైపెడతారు. జాతరకు వెళ్తూ మధ్యలో టోప్లకస (కోనేరు)లో పుణ్యస్నానాలు చేసి ఆలయానికి చేరుకుంటారు.

**నైవేద్య సమర్పణ**

ఆదివాసీ రైతులు పండించిన వడ్లను దంచి బియ్యం సేకరిస్తారు. గోధుమ పిండి, పప్పు, బెల్లంతో పాటు నువ్వులనూనెతో నైవేద్యం వండుతారు. దీపారాధనకు నువ్వులనూనె, నెయ్యి, ఆముదం వినియోగిస్తారు. గంపలో కొబ్బరికాయ, ఆగరవర్తులు, చంద్రం, గుగ్గిలం, కుంకుమ,గులాలు, వంట సామగ్రి పెట్టుకుని సంప్రదాయ వాయిద్యాలతో తరలివెళ్తారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరంమైసమ్మ, పోచమ్మ, రావుర్క్ వద్ద మొక్కులు చెల్లించుకుంటారు. రాత్రి వంటలు చేసుకుని భోజనాలు చేసిఆట పాటలతో అమ్మవారిని ఆరాధిస్తుంటారు.

## సీతాఫల్మండిలో ఆదం పాదయాత్ర

- **సీతాఫల్ మండి డివిజన్‌లో సమస్యలపై దృష్టి**
- **అదం సంతోష్ కుమార్ నేతృత్వంలో సత్వర పరిష్కార చర్యలు**



**సికింద్రాబాద్, విశాలభారతి:** సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్మండి , చిలకలగూడ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నాయకుడు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే & నియోజకవర్గ ఇంచార్జ్ అదం సంతోష్ కుమార్ నేతృత్వంలో సంబంధిత అధికారులతో పాదయాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజ్, తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మత్తులు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి స్థానిక సమస్యలపై అధికారులతో చర్చించి, సత్వర పరిష్కారానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ఇబ్బందులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరితేనే పాలనపై విశ్వాసం పెరుగుతుందని అన్నారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా క్యాడర్‌లో ఉత్సాహం నింపుతూ, ప్రతి కార్యకర్త ప్రజల్లో ఉండి, పార్టీ విధానాలను విస్తృతంగా తీసుకెళ్లాలని అదం సంతోష్ కుమార్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ బలం అని, అదే ఎన్నికల్లో విజయం సాధించడానికి పునాది అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్, జలందర్ రెడ్డి, జగ్గు, జాహేంగీర్, షకీల్ ఖాన్, వాహిద్దుద్దీన్ కొండల్,సురేష్ లాల్, అమర్నాథ్, చక్రం, శిల్ప, కన్పనా, బబ్లు, అనిల్, గంట రాజు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



- **చందానగర్ గ్రామ సర్పంచ్ తోక మురళికృష్ణ**
- **సర్పంచ్, ఉప సర్పంచ్లను సన్మానించిన గ్రామ రేషన్ డీలర్ కట్ట ప్రభావతి**

**మొయినాబాద్, విశాలభారతి:** అందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని, గ్రామ సర్పంచ్ తోక మురళికృష్ణ పేర్కొన్నారు. ఇటీవల గ్రామపంచాయతీ బాధ్యతలు చేపట్టిన నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను గ్రామ రేషన్ డీలర్ ఘనంగా సన్మానించారు. ఆదివారం మొయినాబాద్ మండల పరిధిలోని చందానగర్ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను గ్రామ రేషన్ డీలర్ కట్ట ప్రభావతి గ్రామపంచాయతీ కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు శాలువులతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ కట్ట ప్రభావతి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని, తమకు రావలసిన కమిషన్, బకాయిలు, గౌరవ వేతనం, పెంచాలని, సర్పంచ్ ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. సానుకూలంగా సంధించిన గ్రామ సర్పంచ్ తోక మురళికృష్ణ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో రేషన్ డీలర్ల పాత్ర ఎంతో కీలకమని అందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిద్దుతాన్నని, తెలిపారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కుమ్మరి రాజు, వార్డు సభ్యులు వీరేష్, చాకలి వసంత నవీన్, కుమ్మరి భాస్కర్, కిష్టాపురం మహేందర్, పగడాల ఉషా ప్రభాకర్, ఎండీ. రైసా హాసన్, పూజారి వరలక్ష్మి రాజు, గ్రామ మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధే మా లక్ష్యం



- **నోముల సత్తిరెడ్డి కాలనీ అధ్యక్షులు**
- **ప్రధాన కార్యదర్శి రాచకొండ మల్లేష్**
- **ఐతగోని వెంకటేష్ గౌడ్ ఉపాధ్యక్షులు**

**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర కాలనీ కార్యవర్గ సమావేశం కాలనీ మాజీ అధ్యక్షులు దర్శనం యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. తదనంతరం శ్రీ కంఠమహేశ్వర కాలనీ నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీ నూతన అధ్యక్షులుగా నోముల సత్తిరెడ్డి,ఉపాధ్యక్షులుగా ఐతగోని వెంకటేష్ గౌడ్,సహాయ అధ్యక్షులుగా ఐలాపురం కిష్టయ్య,కడమంచి రాయికల్,ప్రధాన కార్యదర్శి రాచకొండ మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.తదనంతరం మాజీ అధ్యక్షులు దర్శన్ యాదయ్య మాట్లాడుతూ శ్రీ కంఠమహేశ్వర కాలనీ అభివృద్ధికి మా వంతుగా ఎన్నో సేవలు చేశామని,ఇకపై కూడా నూతన కార్యవర్గానికి అందుబాటులో ఉంటూ అన్ని విధాల సహకరిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.తదనంతరం నూతన అధ్యక్ష,ప్రధాన కార్యదర్శిలు ఉపాధ్యక్షులు నోముల సత్తిరెడ్డి ,రాచకొండ మల్లేష్ మరియు ఐతగోని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధే మా లక్ష్యం అని,కాలనీలోని ప్రతి సమస్య మా సమస్యగా భావిస్తూ కాలనీవాసులకు అందుబాటులో వుంటూ అందరినీ కలుపుకొని సమస్య పరిష్కరించేందుకు మా వంతుగా ప్రయత్నం చేస్తామని,మాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన కాలనీ వ్యాసులందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు గంపల వెంకటరెడ్డి,బొల్లెపల్లి వెంకటేష్ గౌడ్,ఆదేపు బిక్షపతి, బండి వెంకటయ్య,గాదభట్ల శంకర శాస్త్రి,లింగంపల్లి శ్రీధర్,రూపని శంకరయ్య,తుమ్మల నాగరాజు రెడ్డి, మార్గం శివ యాదవ్,ఉయ్యాల గణేష్,కదారి ముత్యాలు,ఆరూరి రమేష్,ఎరుకల రామస్వామి,తిరుమలేష్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పిఆర్టియు అధ్యక్షుడు




**రాజేంద్రనగర్, విశాలభారతి:** హైదరాబాదులోని కర్మాన్ఘాట్ ఆంజనేయస్వామి ఆలయంలో పి ఆర్ టి యు రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు సామల మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షులు రాఘవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్ పాల్గొని రంగారెడ్డి జిల్లా 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పి ఆర్ టి యు రాజేంద్రనగర్ మండల శాఖ టేబుల్ మరియు వాల్ క్యాలెండర్ లను పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి తమ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఆస్కాని శ్రీనివాస సాగర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, మండల కార్యదర్శి చిందం వెంకట్, మహిళా ఉపాధ్యక్షురాలు రత్నమాల , మండల కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ భూములను భారత్ ఫ్యూచర్ సిటీలోకి తీసుకోవద్దు

- **సాగుచేసుకొని నాలుగు గ్రామాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు**
- **సాగుదారులకే దేవాదాయ శాఖ భూములు సాగుచేసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి**
- **రైతుల పొట్టమీద కొట్టొద్దు .. నజ్జిక్ సింగారం ఉపసర్పంచ్ వన్నవాడ రవీందర్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం , విశాలభారతి :** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి ఓంకారేశ్వర స్వామి ఆలయానికి చెందిన సుమారు 1400 ఎకరాల భూమిని భారత్ ఫ్యూచర్ సిటీలో డవలప్మెంట్ లో భాగంగా ప్రభుత్వం తీసుకోవాలనే ఆలోచనను వెనక్కి తీసుకొని దేవాదాయ శాఖ భూములు పూర్వం నుంచి సాగు చేస్తున్న రైతులకు సాగు చేసుకునే విధంగా అవకాశం ఇవ్వాలని నజ్జిక్ సింగారం ఉపసర్పంచ్ వన్నవాడ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాచారం మండలంలోని నందివనపర్తి, కుర్మిద్ద, సింగారం, నానక్ నగర్ నాలుగు గ్రామాల ప్రజలు ఓంకారేశ్వర భూములు సాగుచేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ భూములు భారత్ ఫ్యూచర్ సిటీలో డవలప్మెంట్ లో భాగంగా ప్రభుత్వం దేవాదాయ భూములు తీసుకోవాలని చూస్తుందని దీనివల్ల ప్రభుత్వం రైతుల పొట్ట కొట్టొద్దని అన్నారు. ప్రభుత్వం దీనిపై మరొక్కసారి పునరోచన చేసి రైతులు సాగుచేసుకునే భూమిని రైతులు సాగుచేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అందెశ్రీ స్మృతివనం ఏర్పాటు చేయాలి

**బీజేపీ నేత ఏనుగు సుదర్శన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** తెలంగాణ లోక కవి అందెశ్రీ స్మృతి వనం ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి మండిపడ్డారు. అందెశ్రీ అంత్యక్రియలు జరిగి 45 రోజులు గడిచినా స్మారక ఘాట్ గానీ, స్మృతి వనం గానీ ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని ఆయన విమర్శించారు. ఆదివారం ఘట్‌కేసర్ రింగురోడ్డులో అందెశ్రీ అంత్యక్రియలు నిర్వహించిన ప్రదేశాన్ని సందర్శించిన సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ..అంతిమ యాత్రలో పాల్గొని మీడియా ప్రచారం కోసం పెద్ద పెద్ద మాటలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని ఆరోపించారు.అందెశ్రీ స్మృతి వనం ద్వారా తెలంగాణ కళాకారులు, కవులను గౌరవిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు గాలి మేడలుగా కూలిపోయాయని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించినట్లే, దళిత కవిగా పేరుగాంచిన అందెశ్రీ విషయంలోనూ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. దళిత కవి పట్ల ఈ విధమైన నిర్లక్ష్యం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి అందెశ్రీ స్మృతి వనం ఏర్పాటును తక్షణమే ముమ్మరం చేయాలని, లేదంటే పాడే మోసిన చేతులు ఉక్కుపిడికిలిలవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కవులు కళాకారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో చత్తీస్గడ్ వ్యక్తి మృతి




**వాజేడు, విశాలభారతి:** వాజేడు మండల పరిధి మండపాక జాతీయ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన రాత్రి 8 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. మండల పరిధి చంద్రుపట్ల గ్రామంలో ఇంటి స్లాబ్ పని ముగించుకొని మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన 15 భవన నిర్మాణ కార్మికులు మంది కూలీలు ట్రాలీ ఆటోపై వెళుతుండగా ఎదురుగా బైక్ వచ్చి ఢీకొనడంతో ట్రాలీ అదుపుతప్పి బోల్తా కొట్టింది ఈ ఘోర ప్రమాద సంఘటనలో చత్తీస్గడ్ రాష్ట్ర యాట్లపల్లి గ్రామానికి చెందిన కొజ్జా సోడి (30) వ్యక్తి మృతి చెందగా మిగతా 14 మంది కూలీలకు తీవ్ర గాయాలు కావడంతో ఎటునాగారం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# చట్టానికి కళ్ళు లేవు తమ్ముడు

- న్యాయానికి ఇల్లు లేదు ఎప్పుడు
- ఇక్కడున్నదొక్కటే కొట్టి బతకడం
- దొర దొంగయి తిరగడం
- రాజకీయ క్షేత్రంలోనే విషనాగుల పడగ నీడ
- పదవుల వ్యామోహంలో మారిన రాజకీయ నీతి

**భద్రాచలం, విశాలభారతి:** రాజకీయ క్షేత్రంలో ప్రజాక్షేమం పండుటాకుల రాలిపోతుంది బక్క పలసని బతుకులు మెతుకుల కోసం జీవన సమరం చేస్తున్నారు. చట్టాలు హక్కులు కాల రాయబడుతున్నాయి కంచె చేను మేస్తుంటే దీనిని ప్రశ్నించే నాధుడే కరువాయే ఆనాటి రాజకీయ విలువలు వెలవెల పోతున్న నేపథ్యం కనిపిస్తుంది. పేదోడి పట్టెడన్నం కోసం నిత్యం యంత్రంలా పనిచేస్తుంటే చెమట చుక్కను రాల్సని కుబేరులై పాలన సాగిస్తున్నారు. ఎక్కడ చూసినా అవినీతి ఎక్కడ విన్న అరాచకం రాజకీయ నాయకుల్లో కొందరు నీతిని నమ్ముకున్న వాళ్లు ఉన్నారు వాళ్లు ఎప్పటికీ పీడితుల పక్షాన నిరంతర ప్రయాణం సాగించారు. వారే నిడారంభ్రమైన జీవితాన్ని అనుభవించారు చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకున్నట్లు ఈరోజు రాజకీయాల్లో వస్తున్న మార్పులు ప్రగతిని అరిచిపోయే విధంగా ఉన్నాయి. విలువలు లేని రాజనీతి పొద చూపుతుంది ఒక దంపుడు ఉపన్యాసాలు తప్ప ఆచరణ లేకపోవడం అత్యంత దారుణమైన అంశం తాతలు తాగిన నేతుల సంగతి నీతులుగా చెప్పే సంస్కృతి దాపురించింది చట్టాలకు కళ్ళు లేవు అనడంలో అతిశయోక్తి కాదు న్యాయానికి ఇల్లు లేదు అని చెప్పడంలో యదార్థం జీవిత సత్యాన్ని ప్రబోధిస్తున్నాయి మద్యం షాపులను తెరిచి ప్రజలను చిత్తుగా తాగించి అనేక కుటుంబాలను సర్వనాశనం చేసే సంస్కృతి నేడు కనిపిస్తుంది. ప్రజలను తాగుబోపించి వారి రక్త మాంసాలతో పాలన సాగించే రాచరికం ఈరోజు కనిపిస్తుంది చదువుకున్న యువతకు ఉద్యోగాలు ఇవ్వని ప్రభుత్వాలు దర్శనమిస్తున్నాయి నిరుద్యోగులై పొట్ట చేత పట్టుకొని అర్థాకిలితో అలమటించే నేటి యువత రోడ్ల పైన దిక్కుతోచని పరిస్థితుల్లో రాజకీయ విష కౌగిలిలో చిక్కి మద్యానికి బానిసై చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ పరిస్థితి కనిపిస్తుంది మద్యం వ్యాపారానికి ప్రభుత్వమే అనుమతిస్తుంది మద్యం అమ్మి కోట్లు కటిస్తున్న వాళ్లు కొందరైతే దాన్ని తాగి మరణిస్తూ వికట జీవులుగా మారిన జీవితాలు మరెన్నో దర్శనమిస్తున్నాయి ఈ వ్యవస్థను మార్చాల్సిన ప్రభుత్వాలు ప్రజలను పావులుగా వాడుకొని వారి విలాసాలకు ఆహుతి చేస్తున్నారు. ఇసుక మాఫియా ప్రోత్సహిస్తున్న నేతలు కోట్లకు పడగెత్తుతున్నారు ఎక్కడ చూసినా అవినీతి అక్రమాలు



రాజ్యాన్ని శాసిస్తున్నాయి. రాజకీయ పార్టీలకు ఈ అవినీతి అక్రమాల దొరలు కొమ్ముకాస్తున్నారు వారి అరాచకాలకు రాజకీయ పార్టీలు అండదండలు ఉంటున్నాయి ఇక్కడ ఎవరు నష్టపోతున్నారు సామాన్య ప్రజలు మధ్యతరగతి కుటుంబాలు వీధిన పడి అర్థాకలితో చాలీచాలని జీవితాలతో ఈ రాజకీయ నాయకుల పుట్రలకు బలవుతున్నారు. దొంగే దొరై తిరగటం అంటే నేడు చూస్తున్నాం ఆనాటి నాయకుల స్ఫూర్తి నేటి పేదోడు తప్పు చేస్తే జైలు గోడలు అనుభవించాల్సిందే పెద్దోడు తప్పు చేస్తే చట్టం కళ్ళకు గంతలు కట్టడమే డబ్బుంటే చాలు ఎంతటి దొంగ అయినా దొరై తిరగవచ్చు ఎవరి వాటా వాళ్లది ముపులతో చట్టాలను న్యాయాలను కొనే దారుణమైన ప్రమాదకరమైన రాబందుల రాజ్యం ఇది ప్రతి దానికి చిన్నోడి పైనే జులుం అదే పెద్దోడికైతే సలాం ఇదే నేటి రాజకీయ దిక్కుమాలిన హీనమైన చరిత్ర కబ్జాలు అక్రమాలు అవినీతి లంచగొండి వంటి వాళ్లే రాజకీయ నాయకులై రాజ్యాన్ని శాసిస్తున్నారు. నిరుపేదలు పీడితులు నిర్బంధాల మధ్య నలిగిపోతున్నారు వారి అరణ్య రోదన ఎవరు పట్టించుకోకపోవడం దారుణం అనే చెప్పాలి. నీతులు వల్లిస్తూ సిద్ధాంతాలు నెమరువేస్తూ పదవుల కోసం బూర్జువా భూస్వామ్యం పెట్టుబడి దారుల ఆగడాలకు ఆజ్యంపోస్తున్న వారికి ఇప్పటికైనా కళ్ళు తెరుసుకోవాలి. పదవుల కోసం గెలవడం కోసం ఆశయాలను సమాధి చేసి రాబందుల గుంపులో పావురం ల ఆహారం అవటం సరైనది కాదు అరాచక వాదుల విచిన్న కారుల చెరలో చిక్కి నైతిక విలువలను అపహాసము చేయవదు ఓటుకు నోటు ఇచ్చి ప్రజలను ఏ మార్చే వాళ్లకు తగిన బుద్ధి చెప్పాలి. ధన స్వాముల దౌర్జన్యాలను ఎండగట్టాలి పీడిత తాడిత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతకై సిద్ధాంతాల సింధూరాన్ని స్వేచ్ఛగా పూయించాలి. సిద్ధాంతాల శిరస్సు పైన పేదోడి కళేబరాన్ని కాల్చవద్దని తెలుసుకోవాలి చట్టాలకు కళ్ళు కప్పి న్యాయానికి చీకటి నీ తొడిగి చేస్తున్న అరాచకాలను కాల రాయాలి నేటి సమాజంలో నాటి స్ఫూర్తిని గుండెలు నిండా నింపుకోవాలి నా దేహం ముక్కలు అవుతున్న ఈ దేశాన్ని కాపాడుతానని ప్రతిన బునాలి.

## 31.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల ప్రారంభం

**కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని తిరుమల హౌసింగ్ కాలనీలో సుమారు 31.40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీవాసులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీసీ రోడ్ల నిర్మాణం పూర్తవడం సంతోషకరమని తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్లు నిర్మించామని, వీటి వల్ల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ కారణంగా అభివృద్ధి పనులకు కొంత ఆలస్యం జరిగినప్పటికీ, ఎన్నికలకు ముందే మిగిలిన వీధుల్లో కూడా సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పర్వతం మల్లారెడ్డి, కాలనీ అధ్యక్షులు మాలవత్ దేవోజీ నాయక్, ప్రధాన కార్యదర్శి మాదగోని రమేష్ గౌడ్, వీరస్వామి, కోలా శ్రీనివాస్, వీరభద్ర రెడ్డి, పర్వతం శ్రీనివాస చారి, శ్రీనివాసులు, శ్రీనివాస్ నాయక్, వెంకటేశం గౌడ్, పుల్లారావు, రాజశేఖర్ రెడ్డి, వంశీ, లింగం, యాదగిరి, సిద్ధయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## గణితంలో డాక్టరేట్ సాధించిన సైదులు



**రంగారెడ్డి, విశాలభారతి:** ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని నిరూపించిన అక్కెనపల్లి సైదులు. ఎల్బీ నగర్ లోని ఎన్టీఆర్ నగర్కు చెందిన ఆయన ఇప్పటికే గణితం, భౌతిక శాస్త్రాలతో పాటు సైకాలజీ, సోషియాలజీ తదితర కోర్సులలో మాస్టర్స్ చేసి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తాజాగా గణిత శాస్త్రంలో డాక్టరేట్ పట్టా సాధించారు. మధ్యప్రదేశ్లోని శివపురిలో ఉన్న పీకే యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. "అడ్వాన్స్డ్ ఇన్వెంటరీ మోడల్స్ ఫర్ సబ్స్టిట్యూటబుల్, కంప్లిమెంటరీ, అండ్ ఇంపర్ఫెక్ట్ ఐటెమ్స్: ఏ కాస్ట్ అండ్ సస్టైనబిలిటీ అనాలిసిస్" అనే టాపిక్పై థీసిస్ సబ్మిట్ చేశారు. నల్గొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన అక్కె నపల్లి సైదులు... గణితంలో డాక్టరేట్ పొందడం తన చిన్ననాటి కల అన్నారు. ఆ లక్ష్యంతోనే ఉన్నత చదువులు అభ్యసించానని, ఇన్నాళ్లకు తన కల నెరవేరిందన్నారు. విఖ్యాత గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి రోజే తనకు డాక్టరేట్ పట్టా రావడం ఆనందంగా ఉందని అన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి కఠిన శ్రమతో డాక్టరేట్ సాధించిన సైదులు యువతకు స్ఫూర్తిగా నిలుస్తారని, ఆయన విజయం ఎందరికో ఆద ర్శమని సహచర అధ్యాపకులు, సన్నిహితులు అభినందనలతో ముంచెత్తారు.

## పిల్లలకు చదువుపై ఆసక్తి ఎలా పెంచాలి..?




**విశాలభారతి, ఆదిలాబాద్:** పిల్లలు భవిష్యత్తులో మంచి స్థితిలో ఉండటానికి వారినిసరైన మార్గంలో పెంచడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత.దీనికోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యను అందించడమే కాకుండా, వారు బాగా చదవడానికి ప్రోత్సహిస్తారు.దీనికోసం తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి పాఠశాలలో చదివించడమే కాకుండా, వారికి అవసరమైనఅన్ని సౌకర్యాలను కల్పిస్తారు. కానీ, కొన్నిసార్లు పిల్లలుచదువు కంటే ఆటలపై ఎక్కువ ఆసక్తి చూపుతారు. వారికిచదువుపై ఆసక్తి ఉండదు. తల్లిదండ్రుల ఒత్తిడితో వారుచదవడం ప్రారంభించినప్పటికీ, పూర్తి శ్రద్ధతో చదవరు.దీంతో కొన్నిసార్లు తల్లిదండ్రులు తమ పిల్లలను చదవమని తిడతారు లేదా ఒత్తిడి తెస్తారు. కానీ ఇలా చేసినావారికి చదువుపై ఆసక్తి పెరగదు. ఇలాంటి పరిస్థితిలో, మీపిల్లలు కూడా చదువుపై ఆసక్తి చూపకుండా, ఆటలపైనేశ్రద్ధ చూపిస్తే, వారికి చదువుపై ఆసక్తిని పెంచడానికికొన్ని విషయాలు చేయాలి. అవేంటో ఈ పోస్ట్లో తెలుసు కుందాం.

**ప్రశంసించండి**

మీ పిల్లలకి చదువు పై ఆసక్తి కలిగించడానికి ముందుగావారు చేసే చిన్న చిన్న విషయాలను కూడా ప్రశంసించండి. ఎందుకంటే ప్రతి పిల్లవాడు తన తల్లిదండ్రులనుండి దీనినే ఆశిస్తాడు. మీరు మీ పిల్లలను ప్రశంసిస్తేవారి మనోబలం పెరిగి, ఉత్సాహంగా చదువుపై ఆసక్తిచూపడం ప్రారంభిస్తారు.

**ఇతరులతో పోల్చకండి**

చాలా మంది తల్లిదండ్రులు చేసే తప్పు ఇదే. తమ పిల్లలుబాగా చదవాలనే ఉద్దేశంతో చాలా మంది తల్లిదండ్రులుతమ పిల్లలను ఇతర పిల్లలతో లేదా పిల్లల స్నేహితులతోపోలుస్తారు. కానీ ఇది తప్పు. తల్లిదండ్రులు చేసే ఈ పనివల్ల పిల్లలు చదువు నుండి దూరమవుతారు. వారికి చదవాలనే ఆలోచనే రాదు. కాబట్టి తల్లిదండ్రులారా మీ ఈఅలవాటును వెంటనే మార్చుకోండి.

**చదువుకోసంసమయం కేటాయించండి**

మీ పిల్లలకి ఒక దినచర్యను ఏర్పాటు చేయండి. ఆదినచర్య ద్వారా మీరు మీ పిల్లలను ప్రోత్సహించవచ్చు. పిల్లల చదువుకోసం సమయం కేటాయిస్తే వారుదానిని ప్రతిరోజూ పాటిస్తే వారి పూర్తి దృష్టి చదువుపైనేఉంటుంది. ముఖ్యంగా పిల్లలను 45 నిమిషాలకు మించిచదివించకండి.

**ఒత్తిడి చేయొద్దు**

పిల్లలను బాగా చదవడానికి ప్రోత్సహించాలి కానీ వారిపైచదువు ఒత్తిడిని చేయకూడదు. ఇది వారిపై ప్రతికూలప్రభావాన్ని చూపుతుంది. పిల్లలకు చదువు భారంగాఅనిపిస్తుంది. కాబట్టి, తల్లిదండ్రులారా మీరు మీ పిల్లలపైచదువు ఒత్తిడిని ఎప్పుడూ చేయకండి.

**యోగా, ధ్యానం**

చదువు వల్ల పిల్లలు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండటానికి వారిని యోగా, ధ్యానం చేయించండి. దీనివల్లవారి మనసు ప్రశాంతంగా ఉండి, మెదడు చురుగ్గా పనిచేస్తుంది. దీనితో పాటు, పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించండి.

## నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన కళ్లెం




**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ నూతన కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని, నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శుభోదయ కాలనీ అభివృద్ధిలో కాలనీ కార్యవర్గ సభ్యుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వమే కాలనీల అభివృద్ధికి బాట వేస్తుందని తెలిపారు. మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, రోడ్లు, డ్రైనేజ్ తదితర అంశాల్లో తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. శుభోదయ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కాలనీ గౌరవ అధ్యక్షులు ఈటగోని నరసింహ, శ్రీనివాస్ గౌడ్, కాలనీ నూతన అధ్యక్షులు డి. గోపాల్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సతీష్, శ్రీనివాస్, బిజెపి నాయకులు సంఘీ అశోక్, శక్తి సింగ్, ఎర్ర శ్రీకాంత్తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య




- అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని ఘాతుకం
- రూ. 35 వేలకు సుపారీ ఒప్పందం
- గుట్టురట్టు చేసిన మాక్లూర్ పోలీసులు
- భార్య, ప్రియుడు సహా ఆరుగురి అరెస్టు

**నిజామాబాద్, విశాలభారతి:** ప్రియుడి మోజులో పడి ఓ భార్య భర్తను హత్య చేసింది.ఈ ఘటన మాక్లూర్ మండలంలోని బోర్గాం(కె) గ్రామంలో చోటు చేసుకుంది. ఈ మేరకు పోలీసులు హత్యకు కారకులైన భార్య,ప్రియుడితోపాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకొని ఆదివారం రిమాండ్ కు తరలించినట్లు ఏసిపి రాజా వెంకటరెడ్డి తెలిపారు .ఈ మేరకు ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. బొర్గామ్ (K) గ్రామానికి చెందిన పల్లటి రమేశ్ (35) భార్య సౌమ్యకు, నందిపేట్ మండలానికి చెందిన పీఈటీ టీచర్ నాలేశ్వరం దిలీప్తో అక్రమ సంబంధం ఏర్పడిందనీ తెలిపారు. ఈ విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. అడ్డొస్తున్న భర్తను ఎలాగైనా వదిలించుకోవాలని సౌమ్య తన ప్రియుడితో కలిసి పథకం వేసింది. అందుకు గత ఆగష్టు నెలలో మృతుడు ఆర్మూర్ నుండి నిజామాబాద్ కి తన బైక్ పై వస్తున్నపుడు చిన్నాపూర్ గండి వద్ద , నాలేశ్వర్ దిలీప్ అతని తమ్ముడు లు కలిసి కార్ తో ఢీ కొట్టి హత్య చేయడానికి ప్రయత్నిచగా అది విఫలం అయినది. రోడ్డు ప్రమాదం రూపంలో రమేశ్ను చంపాలని చూసినా ఫలితం దక్కలేదు.రెండో ప్రయత్నంలో ఎలాగైనా రమేష్ ను హత్య చేయాలని నిర్ణయించుకున్న నిందితులు.. సుపారీ గ్యాంగ్ను ఆశ్రయించారు. ఇందుకు తన బంగారు ఉంగరాన్ని ముత్తూట్ ఫైనాన్స్లో తాకట్టు పెట్టి వచ్చిన రూ. 35 వేలను కిరాయి హంతకులకు సుపారీగా ఇచ్చినట్లు తెలిపారు. డబ్బుతో దిలీప్ తన తమ్ముడు అయిన మాధాపూర్ గ్రామానికి చెందిన అభిషేక్ ను సంప్రదించగ అభిషేక్ అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు అయిన బంటు జితేందర్ ను దిలీప్ కు పరిచయం చేయగా జితేందర్ ద్వారా వేనుకిసాన్ నగర్ తండా కు చెందిన కెలోత్ శ్రీరామ్, రమావత్ రాకేశ్, వాళ్ళ స్నేహితుడు అయిన మోసిన్ ల కు పరిచయం చేయగా బంగారం ఉంగరం అమ్మగా వచ్చిన 35,000 రూపాయల ను పల్లటి రమేశ్ ను చంపాలని సుపారీగా శ్రీరామ్, రాకేశ్ , మోసిన్ ల కు అడ్వాన్స్ గా ఇరవై వేలు, 16 తేదీన, మిగితా పదిహేను వేలు తేదీ 19న ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు భార్య డిసెంబర్ 19వ తేదీ రాత్రి భోజనంలో సుమారు 10 నిద్రమాత్రలను కలిపి రమేశ్‌క ఇచ్చింది. అతను గాఢ నిద్రలోకి జారుకోగానే ప్రియుడు దిలీప్, అతని తమ్ముడు అభిషేక్కు సమాచారం ఇచ్చింది. వారు వచ్చి నిద్రలో ఉన్న రమేశ్ మెడకు టవల్‌తో ఉరివేసి, నోరు, ముక్కుపై దిండుతో అదిమి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చినట్లు తెలిపారు. మరుసటి రోజు ఉదయం ఏమీ తెలియనట్టు తన భర్త హార్ట్ ఎటాక్‌తో చనిపోయాడని అందరినీ నమ్మించి అంత్యక్రియలు కూడా జరిపించింది.కానీ ఇజ్రాయిల్లో ఉన్న మృతుడి సోదరుడు కేధారి, తమ్ముడి భార్య అనితలకు మృతదేహంపై ఉన్న గాయాలను చూసి అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు రంగంలోకి దిగి, తహసీల్దార్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించగా.. అది ఊపిరి ఆడక జరిగిన హత్యని తేలింది.దీంతో హత్య లో ప్రత్యక్షంగా పాల్గొన్న మృతుని భార్య పల్లటి సౌమ్య, పందుల అరుణ లత , ఆమె ప్రియుడు నాలేశ్వర్ దిలీప్, అతని తమ్ముడు యెర్రొల్ల అభిషేక్, హత్య కు సంబంధించి కుట్రలో భాగంగా ఉన్న సుపారి గాంగ్ అయిన బంటు జితేందర్, శ్రీరామ్ , రమావత్ శ్రీకాంత్ ల ను అదుపు లో కి తీస్కోని, విచారించగా వారు చేసిన నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు.ఈమేరకువారిని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. సుపారి గాంగ్ లో ని మరోక సభ్యుడు అయిన మోసిన్ పరారీ లో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన నార్త్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్ , మాక్లూర్ ఎస్ఐ ఎం. రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్, కానిస్టేబుల్లు చందు, బాలాలింగం, రాకేశ్, రామకృష్ణ, శ్రీనివాస్, శ్రీకర్ గౌడ్, లక్ష్మీప్రసన్న, రచిత, బాబునాయక్, శ్రీకాంత్ గౌడ్, దత్తాద్రి గౌడ్, వెంకటస్వామి, సురేంధర్, చరణ్ లను ఏసిపి రాజా వెంకటరెడ్డి అభినందించారు.

## రాత్రివేళ దొంగ ఇసుక ట్రాక్టర్ల గోల

- ప్రజల నిద్రకు భంగం వాటిల్లుతున్న ఘటన
- రెచ్చిపోతున్న అక్రమ ఇసుక రవాణా దారులు
- అడ్డొచ్చిన వారి కి వార్నింగ్
- ఏం చేసుకుంటావో చేసుకోపో నువ్వేం చేయలేవు
- ప్రశ్నించే వారిని బెదిరిస్తున్న అక్రమ ఇసుక ట్రాక్టర్ల యాజమాన్యం
- ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి ఇసుకను ప్రజలకు అందుబాటులో తేవాలి



**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం పట్టణం లో ఎన్నడూ లేని విధంగా ఈ మధ్యకాలంలో భద్రాచలం ఇసుక ను ఎటువంటి అనుమతులు లేకుండా అడ్డదారిన అక్రమ ఇసుక రవాణా నిర్వహణ యదేచ్ఛగా సాగుతుంది. అర్ధరాత్రి మొదలుకొని తెల్లవారి వరకు ఇసుక ట్రాక్టర్లు వివిధ కాలనీలలో తోలకాలు జరుగుతున్నాయి. ఈ శబ్దాలకు కాలనీవాసులు నిద్ర కు భంగం వాటిల్లుతుంది నిద్ర పట్టని రాత్రులు గడుపుతున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు. దొంగ ఇసుక రవాణాను అధికారులు అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాదనం ఇసుకను అక్రమ మార్గంలో తరలిస్తూ ఖాళీ స్థలాల్లో డంపింగ్ చేస్తూ రాత్రికి రాత్రే ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అమ్మేసుకుంటున్నారని ప్రభుత్వ ఆదాయ వనరు అయిన ఇసుకను ప్రభుత్వ అధికారుల కన్ను కప్పి తోలుకుపోతున్నారని పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తెల్లవార్లు ఇదే పనిగా ట్రాక్టర్ల యాజమాన్యం పనిచేస్తున్నారని దీనికి పట్టణ అధికారులు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని లేదంటే ప్రభుత్వ ధనం దొంగల పాలవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పట్టణ వాసులకు ఇసుకను అధిక ధరలకు అమ్ముతున్నారని అదే ప్రభుత్వ ఇసుకరీచులను ఏర్పాటు చేసి ప్రజలకు ఇసుకను అందుబాటులో అందించాలని ఎవరైతే ట్రాక్టర్ల ద్వారా అక్రమ మార్గంలో ఇసుకను తరలిస్తున్నారు. వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుని కట్టడి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపైన దురుసుగా ప్రవర్తిస్తూ ఏం చేసుకుంటావో చేసుకోపో అనే విధంగా వ్యవహరిస్తున్నారని దీని వెనుక ఎవరి హస్తం ఉందని అనుమానం ప్రజల్లో వ్యక్తం అవుతుంది. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు ప్రజాతంత్ర వాదులు కోరుతున్నారు.

## మహిళా సాధికారతకు సావిత్రిబాయి ఎనలేని కృషి

**పిడిఎస్ యు డివిజన్ అధ్యక్షులు గడ్డం గౌతమ్**




**విశాలభారతి, హైదరాబాద్:** భారతదేశం మొదటి మహిళ ఉపాధ్యాయురాలు,సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా పిడిఎస్ యు విద్యానగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ముసారంబాగ్ బీసీ హాస్టల్ లో ఆమె చిత్రపటానికి పూలమాలవేసినివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యానగర్ అధ్యక్షులు గడ్డం గౌతమ్ మాట్లాడుతూ..సావిత్రిబాయి పూలే మహిళా సాధికారత కోసం కృషి చేసిన మహనీయులు కులమత భేదాలు,అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు.వితంతువుల వివాహాలు, శిశు హత్యల నిరోధానికి కృషి చేశారు.మహిళల విద్యావ్యాప్తికి పాటుపడ్డారని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యానగర్ ఉపాధ్యక్షులు నాగరాజు,సహాయ కార్యదర్శి మనోజ్ కుమార్, అదేవిధంగా,కమిటీ సభ్యులు నరేష్, యశ్వంత్, గణేష్, హాస్టల్,విద్యార్థులు,మణికుమార్ మహేందర్, విక్రమ్ రాకేష్, ప్రసాద్, కేదార్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ కోర్టు తొలి ప్రభుత్వ న్యాయవాదిగా వాకిటి నరసింహ రెడ్డి



**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రభుత్వ న్యాయవాదిగా వాకిటి నరసింహారెడ్డిని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆయన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. చౌటుప్పల్ మండలం,పెద్ద కొండూరు గ్రామ పరిధికి చెందిన వాకిటి నరసింహారెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో న్యాయవిద్యను పూర్తి చేసారు. 2010 సంవత్సరంలో తెలంగాణ బార్ కౌన్సిల్లో న్యాయవాదిగా నమోదు చేసుకొని 2010 సంవత్సరం నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. న్యాయవాదిగా తొలిసారి రంగారెడ్డి జిల్లా కోర్టులో తన ప్రాక్టీస్ ను మొదలు పెట్టారు. అనంతరం 2021 లో తొలిసారి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేసినప్పటి నుండి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ తెలంగాణ బార్ కౌన్సిల్లో గుర్తింపు పొందిన తర్వాత జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా తాను గెలుపొంది తన సేవలను అందించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమైన వాకిటి నరసింహారెడ్డి మాట్లాడుతూ... తనను ప్రభుత్వం న్యాయవాదిగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.తాను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చౌటుప్పల్ కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది అవసరాన్ని గుర్తిస్తూ ఏర్పాటు చేయాలని అప్పటి న్యాయశాఖ కార్యదర్శికి పలుమార్లు వినతి పత్రాలు ఇవ్వటం జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చౌటుప్పల్ కోర్టుకు మొదటి ప్రభుత్వ న్యాయవాదిగా తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు.చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రభుత్వ న్యాయవాదిగా వాకిటి నరసింహారెడ్డి నియామకం పట్ల తోటి న్యాయవాదులు,పట్టణ పుర ప్రముఖులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు కోసం కృత్రిమ మేధస్సు

**పరిశోధన అవకాశాలు"పై జాతీయ స్థాయి వెబినార్**




**విశాలభారతి, హైదరాబాద్:** ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ సైన్సెస్ అండ్ అడ్వాన్స్డ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో "స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు కోసం కృత్రిమ మేధస్సు : పరిశోధన అవకాశాలు" అనే అంశంపై ఉచిత జాతీయ స్థాయి వెబినార్ను శనివారం, 10 జనవరి 2026 నిర్వహించనున్నారు. ఈ వెబినార్ ద్వారా సంయుక్త రాజ్యసమితి నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కృత్రిమ మేధస్సు ఎలా ప్రభావవంతంగా ఉపయోగపడుతుందో, ముఖ్యంగా పరిశోధన అవకాశాలు, నైతిక మరియు బాధ్యతాయుత ఎ ఐ వినియోగం, వాస్తవ ప్రపంచ అనువర్తనాలు వంటి అంశాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు నిపుణుల ప్రసంగాలు అందించనున్నారు. డా. జి. ఎన్. ఆర్. ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంసీఏ విభాగం, చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , హైదరాబాద్, ఎస్డిజి -1 అండ్ 2 (పేదరిక నిర్మూలన మరియు ఆకలి రహిత సమాజం) అంశాలపై ప్రసంగిస్తూ, సామాజిక మరియు వ్యవసాయ అభివృద్ధికి ఎఐ ఆధారిత పరిష్కారాలు వివరించనున్నారు. అలాగే, రెండవ వక్తగా డా. కె. ఆర్. ఎన్. కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ మరియు ప్రొఫెసర్ , రిషి ఇంజినీరింగ్ కళాశాల , ఎస్డిజి-3 (మంచి ఆరోగ్యం మరియు శ్రేయస్సు) అంశంపై మాట్లాడుతూ, స్మార్ట్ హెల్త్కేర్ వ్యవస్థల్లో ఎఐ వినియోగంపై విశ్లేషణ అందించనున్నారు. ఈ వెబినార్ ముఖ్యాంశాలలో ఎస్డిజి కోసం ఎ ఐ పరిష్కారాలు, నైతిక మరియు బాధ్యతాయుత ఎఐ , పరిశోధనలో ఎదురయ్యే సవాళ్లు మరియు అవకాశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమం విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు మరియు పరిశ్రమ నిపుణులకు అందుబాటులో ఉంటుంది. ఆసక్తి గల వారు పోస్టర్లో ఇచ్చిన క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.



# ‘టాక్సిక్’లో నయనతార.. ఆకట్టుకుంటోన్న లుక్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ ‘టాక్సిక్’ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ‘ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్’ అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో నయనతార లుక్‌ను టీమ్ రిలీజ్ చేసింది. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకొని పవర్‌ఫుల్ లుక్స్‌తో నయన్ కనిపించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.